RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 21 జూన్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:20

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

## ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక

## పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం

## వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి

## వ్యాధి చికిత్స కంటే నివారణే మిన్న

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. ?అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. ?రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు.

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు.

వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు.

ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణే అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ,

మిగతా 2లో

# పాడి రైతుకు భరోసా

## డిప్యూటీ సీం భట్టి విక్రమార్క



వార్తా 3 లో

## పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యవంతమైన సమాజం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

వార్తా 2 లో

# మహిళా శక్తి చీరల పంపిణీ చేసిన మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్

## బంజారా భవన్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్, జూన్ 20, 2026 హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న బంజారా భవన్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి






తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ , ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , ఎమ్మెల్సీ వెంకట బాల్మూర్ జీహెచ్ఎంసీ కమిషనర్ , ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళా ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద పెద్ద సంఖ్యలో మహిళా లబ్ధిదారులకు చీరలను పంపిణీ చేశారు. మహిళల సంక్షేమం మరియు సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సభలోని ప్రముఖులు అభినందించారు.

కార్యక్రమం అనంతరం లబ్ధిదారులతో మంత్రి మరియు ఇతర ప్రజాప్రతినిధులు ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.

# మెట్రో పై మరోసారి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



హైదరాబాద్ మెట్రో రైల్ పెండింగ్ అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మెట్రో ఫేజ్-2, ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. జూన్ 20న ఆయనకు మరో లేఖ రాశారు.

జూన్ 16న తాను రాసిన లేఖలో హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన సమస్యలను ప్రస్తావించానని సీఎం గుర్తుచేశారు.

పెండింగ్ అంశాలపై త్వరితగతిన పరిష్కారం అవసరమని, అందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, ఆ సమయంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు.

మెట్రో టేకోవర్, ఐఎఫ్ ఆర్ సీ తో రుణ ఒప్పందాలు, మెట్రో ఫేజ్ 2 ప్రతిపాదనల ప్రతులను కూడా తాను తీసుకువస్తానని సీఎం ఈ లేఖ ద్వారా తెలియజేశారు. సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని కిషన్‌రెడ్డిని కోరారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా కదిలేది లేదు: కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసే వరకు జంతర్ మంతర్ నుంచి కదిలే ప్రసక్తి లేదని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. నీట్-యూజీ 2026 పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలకు నిరసనగా ఆయన ఈ ఆందోళన చేపట్టారు. పోలీసుల అనుమతి గడువు ముగిసినప్పటికీ, ఆయన తన నిరసనను కొనసాగిస్తుండటం గమనార్హం.

ఈ ఆందోళనలో విద్యార్థులు, మద్దతుదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకారులు ప్లేట్లు, స్పూన్లతో శబ్దం చేస్తూ వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమ శాంతియుత నిరసనను కొనసాగించేందుకు అనుమతిని పొడిగించాలని దీప్కే అధికారులను కోరారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న వరుస తప్పిదాల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతున్నా, ధర్మేంద్ర ప్రధాన్ ఇంకా పదవిలో కొనసాగడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

శనివారం సాయంత్రంతో నిరసన గడువు ముగియడంతో పోలీసులు జంతర్ మంతర్‌ను ఖాళీ చేయించేందుకు ప్రయత్నించారు. అయితే, తమ ఆందోళనను శాంతియుత మార్గంలోనే కొనసాగిస్తామని దీప్కేతో పాటు ఆయన మద్దతుదారులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చకపోతే, దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని సీజేపీ హెచ్చరించింది.

ప్రజాబలం

21 జూన్ 2026 ఆదివారం

# పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యవంతమైన సమాజం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




హైదరాబాద్, జూన్ 20, 2026: పర్యావరణ పరిరక్షణ, మానవ ఆరోగ్యం ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని,పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితం అవుతుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యశోద గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ , హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ లీడర్‌షిప్ ప్లాట్‌ఫామ్ (HELP) ఆధ్వర్యంలో హైటెక్ సిటీలో శనివారం నిర్వహించిన "ఇంటర్నేషనల్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్"లో గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లు కేవలం ప్రకృతికే పరిమితం కాకుండా మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వైద్య రంగం కేవలం వ్యాధుల చికిత్సకే పరిమితం కాకుండా ఆరోగ్యం--పర్యావరణం మధ్య ఉన్న సంబంధాలను మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యవంతమైన జీవన విధానాల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వం కీలకమైందని గవర్నర్ అన్నారు. "మిషన్ లైఫ్ " ద్వారా ప్రతి పౌరుడు పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారని, నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు పర్యావరణంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని తెలిపారు. జీ-20 వేదికగా ప్రధానమంత్రి ప్రతిపాదించిన "వన్ ఎర్త్ -- వన్ హెల్త్" భావన నేటి కాలానికి అత్యంత అవసరమైందని గవర్నర్ పేర్కొన్నారు. మానవులు, జంతువులు, పర్యావరణం ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, పర్యావరణాన్ని దెబ్బతీస్తూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదని అన్నారు.

ఆరోగ్య రంగంలో భారత్ విశేష పురోగతి సాధిస్తోందని, ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమైన 'ఆయుష్మాన్ భారత్' కోట్లాది మందికి భరోసా కల్పిస్తోందని చెప్పారు. డిజిటల్ హెల్త్ ఎకోసిస్టమ్ విస్తరణ, వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధితో భారత్ ప్రపంచ ఆరోగ్య రంగంలో కీలక కేంద్రంగా ఎదుగుతోందన్నారు.తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ నగరం వైద్య విద్య, లైఫ్ సైన్సెస్, అత్యాధునిక పరిశోధనల రంగంలో దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆరోగ్య సేవలు, వైద్య ఆవిష్కరణలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని అన్నారు.

యశోద ఆసుపత్రులు వంటి ప్రముఖ వైద్య సంస్థలు కేవలం చికిత్సా కేంద్రాలుగానే కాకుండా పర్యావరణ పరిరక్షణ, ఇంధన సామర్థ్య పెంపు, వ్యర్థాల నిర్వహణ, సామాజిక బాధ్యత వంటి అంశాల్లో ఆదర్శంగా నిలవాలని గవర్నర్ సూచించారు.

ఆరోగ్యవంతమైన పౌరులు, బలమైన వైద్య వ్యవస్థ, సురక్షిత పర్యావరణం సమన్వయంతో ముందుకు సాగినప్పుడే 'వికసిత భారత్' లక్ష్యం సాకారమవుతుందని ఆయన అన్నారు. ఈ సదస్సులో జరిగే చర్చలు ఆరోగ్య రంగాన్ని మరింత స్థిరమైన, పర్యావరణహితమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన దిశగా నడిపిస్తాయని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో యశోద గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్, ఎన్విరాన్ మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీజేపీ గాడ్సే జపం చేస్తోంది

## గాంధీ భవన్‌లో సత్యాగ్రహ దీక్షలో మహేష్ కుమార్ గౌడ్







**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన తీరుకు నిరసనగా గాంధీ భవన్‌లో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆల్ ఇండియా చైర్మన్ సునీల్ పన్వర్ , ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్ హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

సత్యాగ్రహ దీక్షలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , ఎమ్మెల్యే నవీన్ యాదవ్, పలువురు డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్ట్రోలింగ్ మాట్లాడుతూ

రఘుపతి రాజారాం పేరును బీజేపీ మరిచిపోయింది

బీజేపీ గాడ్సే జపం చేస్తోంది

గాడ్సే రాజ్యం స్థాపించాలని వ్యూహం పన్నుతున్నారు

సొంత ఎజెండాను తీసుకొచ్చి జనాలపై రుద్దుతున్నారు

అధికారంలో శాశ్వతం ఉండటం కోసం ఎంత దూరమైన వెళ్తున్నారు

బీజేపీ చెప్పిందే రాజ్యాంగం అనేలా వ్యవహరిస్తున్నారు

ప్రాంతీయ పార్టీలను చీల్చి చెండాడుతున్నారు

2 కోట్ల ఉద్యోగాలు అని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారు

90 శాతం సంపద బీజేపీ నేతల అనునయుల చేతిలో ఉంది

ఆర్ఎస్ ఎస్ భావాలు గల వ్యక్తులు యూనివర్సిటీ లో దూరి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు

చైనా చొచ్చుకొస్తా ఉంది. ఆ విషయం మాట్లాడారు

రాహుల్ గాంధీ లోక్ సభ లో ఫోటోలతో చూపించారు

గాంధీ కుటుంబం త్యాగ మూర్తుల కుటుంబం

నెహ్రూ,గాంధీ గురించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారు

దేశం కోసం ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారు

లక్షల కోట్ల ఈశాన్య రాష్ట్రాల సంపద దోచి పెడుతున్నారు

మీనాక్షి విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు.

కేసు లేకుండా నామినేషన్ రిజెక్ట్ వ్యవహరించిన ఆర్ఓ నీ ఉరి తీసిన తప్పులేదు

జార్ఖండ్ లో అంబానీ తరపు వ్యక్తికి సరైన పత్రాలు లేకున్నా మరోసారి అవకాశం ఇచ్చారు

దేవుడు పేరు చెప్పకుండా బీజేపీ నేతలు గెలిచే దమ్ముందా?

ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారు

పవన్ ను బూచిగా చూస్తున్నారు

బీజేపీ కి తెలంగాణలో స్థానం లేదు

మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

లౌకిక వాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు.

వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ?వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# అపహాస్యమవుతున్న హాస్యం

ప్రస్తుత డిజిటల్ యుగంలో స్టాండప్ కామెడీ సంస్కృతి యువతను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అయితే, ఈ మధ్యకాలంలో హాస్యం పండించడం కంటే వివాదాలు సృష్టించడమే దీని ప్రధాన లక్షణంగా మారిందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. కామెడీ క్లబ్‌లలో లేదా సోషల్ మీడియా రీల్స్‌లో వ్యక్తమవుతున్న కొన్ని అభిప్రాయాలు, జోకులు నవ్వు తెప్పించకపోగా, వినేవారికి తీవ్ర అసహ్యం కలిగిస్తున్నాయి. హాస్యానికి , ఎగతాళికి, అవమానపర్చడానికి , అసభ్యతకు మధ్య ఉన్న లక్ష్మణ రేఖను కొందరు పూర్తిగా విస్మరిస్తుండటంతో ఈ సరిహద్దుల వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్తోంది.ఇలాంటి వివాదాల్లో చిక్కుకుంటున్న వారిలో ఎక్కువ మంది ప్రొఫెషనల్ కామిక్స్ కాకపోవడం గమనార్హం. ఐటీ రంగానికి చెందిన టెకీలు, వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు, ఇతర రంగాల వారు కేవలం పార్ట్-టైమ్ క్రేజ్ కోసం మైక్ పట్టుకుని స్టేజ్ ఎక్కుతున్నారు. గతంలో ఒక ప్రదర్శనలో ఐదేళ్ల చిన్నారిపై అత్యంత అసహ్యకరమైన, లైంగిక కోణంలో జోకులు వేసిన ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఇటీవల ముంబై, గురుగ్రామ్‌లలో జరిగిన 370 రూపాయల బిర్యానీ వివాదం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. మహిళల ఆత్మగౌరవాన్ని, సమ్మతిని కించపరిచేలా ప్రేక్షకులు మాట్లాడిన మాటలను సదరు కమెడియన్ అడ్డుకోకుండా ప్రోత్సహించడంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. దీనివల్ల సదరు వ్యక్తులు తమ చేతులా కెరీర్లను పాడుచేసుకోవడమే కాకుండా, ఉద్యోగాలు కోల్పోయి చట్టపరమైన ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు.రాజకీయ విమర్శల పేరుతో నేతల వ్యక్తిగత, కుటుంబ జీవితాలను కించపరిచేలా మాట్లాడటం స్టాండప్ కామెడీ కాదు.. అది ముమ్మాటికీ వ్యక్తిత్వ హననమే. రాజకీయ నాయకులను టార్గెట్ చేస్తూ కామెడీ చేయడం ఈ రంగంలో ఒక సాధారణ అంశమే అయినప్పటికీ, ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులపై కొందరు కమెడియన్లు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హైదరాబాద్‌కు చెందిన కమెడియన్ అనుదీప్ కాటికాల పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ వ్యవహారాలను ఎగతాళి చేస్తూ చేసిన వ్యాఖ్యలపై జనసేన శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. ఫలితంగా ఏపీ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి మరీ అతడిని అరెస్ట్ చేయాల్సి వచ్చింది. అలాగే మరో కమెడియన్ శరత్ ఉదయ్ గతంలో చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లను ఉద్దేశించి చేసిన పాత జోకులపై బెంగళూరులో జరుగుతున్న లైవ్ షోలో కొందరు అభిమానులు గొడవకు దిగి, బలవంతంగా క్షమాపణలు చెప్పించడం కూడా పెద్ద సంచలనంగా మారింది.రాజకీయ విమర్శలు, వ్యంగ్యం అనేది ప్రజాస్వామ్యంలో సహజం. అమెరికా, యూరప్ దేశాల్లో అధ్యక్షులపైనే తీవ్రమైన జోకులు వేస్తుంటారు. కానీ, అక్కడ ఆ వ్యంగ్యం వారి విధానాలు, నిర్ణయాలపై ఉంటుంది తప్ప వారి వ్యక్తిగత జీవితాల మీద, భార్యాపిల్లల మీద ఉండదు. మన దగ్గర జరుగుతున్న పొరపాటు ఇదే. పవన్ కల్యాణ్ గత వైవాహిక జీవితాన్ని ప్రస్తావించడం, లేదా చంద్రబాబు నాయుడిపై జరిగిన పాత హత్యాయత్న ఉదంతాలను హాస్యాస్పదం చేయడం ఏమాత్రం ప్రొఫెషనలిజం అనిపించుకోదు. కామెడీ పేరుతో సినీ సెలెబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగు స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికాల అరెస్ట్ అయ్యారు. కాకినాడ పోలీసులు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనుదీప్ సినిమా సెలెబ్రిటీలను కించపరుస్తూ కామెడీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నిహారిక, రామ్ చరణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఆ వీడియోలను చూసిన మెగా అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షో జరుగుతున్న చోటుకు వెళ్లారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న అనుదీప్ అక్కడినుంచి పరారయ్యాడు. రెండు రోజుల తర్వాత మెగా కుటుంబానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేశాడు. అయినా లాభం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే జనసేన పార్టీ ఈస్ట్ గోదావరి జాయింట్ సెక్రటరీ బడే వెంకట కృష్ణ.. కాకినాడ పోలీస్ స్టేషన్‌లో అనుదీప్‌పై ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న కాకినాడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నవ్వులు పూయించాల్సిన వేదికలు కాస్తా, రాజకీయ కక్షలకు, వ్యక్తిగత దూషణలకు సాధనాలుగా మారుతుండటంతోనే సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందిఈ పరిణామాలన్నీ స్టాండప్ కామెడీ రంగంలో సెల్ఫ్ సెన్సార్‌షిప్ ఎంత అవసరమో గుర్తుచేస్తున్నాయి. కేవలం కొన్ని వ్యూస్ కోసం, చప్పట్ల కోసం , వైరల్ అవ్వాలనే తాపత్రయంతో సమాజం అంగీకరించని హద్దులను దాటడం వల్ల కెరీర్‌లు ముగిసిపోతాయి తప్ప గుర్తింపు రాదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో.. హాస్యం అంటే ఎదుటివారిని నొప్పించడం కాదు, మెప్పించడం అనే కనీస ధర్మాన్ని కమెడియన్లు తెలుసుకోకపోతే ఈ వేదికల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

# పాడి రైతుకు భరోసా

## 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
## పాడి రైతులకు బకాయిల్లేని పేమెంట్లు
## లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
## డిప్యూటీ సీం భట్టి విక్రమార్క



రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగాఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.

రైతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్దతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరు



హైద్రాబాద్ జూన్ 20; పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరైంది. మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆయనకు వారం రోజులపాటు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. దీంతో చర్లపల్లి జైలు నుంచి అధికారులు ఆయన్ని విడుదల చేశారు. బాలిక ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు బగీరథ్‌ను మే 16న అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సుమారు నెల రోజుల పాటు భగీరథ్? చర్లపల్లి జైలులో ఉన్నారు. ప్రస్తుతం బెయిల్? మంజూరు కావడంతో పోలీసులు ఆయనను జైలు నుంచి విడుదల చేశారు.

# ఎన్ బీఐ వర్సెస్ ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 20, రాయదుర్గం భూముల విషయంలో ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం రోజురోజుకూ తీవ్రం అవుతోంది. ఆ భూమి తమదే అంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం స్టే ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎస్‌బీఐ తీరుపై రేవంత్ సర్కార్ తీవ్రంగా మండిపడింది. ఆ భూమిని తాము గతంలోనే కొన్నామని.. అందులో కొంత భాగం తమదేనని కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంతో ప్రభుత్వానికి ఎస్‌బీఐలో ఉన్న అకౌంట్లను ఇతర బ్యాంకులకు మార్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాయదుర్గం భూముల వేలం ధరతో మాత్రమే కాకుండా.. వివాదాలతోనూ ఇప్పుడు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. వేలంలో ఎకరం ధర రూ.237 కోట్లు పలికి.. అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసిన ఈ భూములపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రంగంలోకి దిగింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయగా.. అది తమ భూమే అని పేర్కొంటూ.. తెలంగాణ హైకోర్టులో ఎస్‌బీఐ రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వేలం ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ).. ఇటీవల గత నెల 28వ తేదీన రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని అత్యంత విలువైన 11.38 ఎకరాల భూమిని వేలం వేయగా.. రూ.2,529 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. అయితే అందులో 5.09 ఎకరాలు తమ భూమి ఉందంటూ ఇప్పుడు ఎస్‌బీఐ పేర్కొంటోంది. 2010లోనే ఆ భూమిని రూ.13.33 కోట్లకు తాము కొనుగోలు చేశామని ఎస్‌బీఐ వాదిస్తోంది. ఈ భూములను వేలంలో గౌరా వెంచర్స్ అనే సంస్థ ఎకరం భూమిని రూ.237 కోట్ల చొప్పున దక్కించుకుంది.ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ వైఖరిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ అయింది. రాయదుర్గం భూముల వేలంలో నిబంధనలు ఉల్లంఘించింది ఎస్‌బీఐ అని ఆరోపిస్తోంది. ఈ భూముల వేలంపై ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదం తీవ్ర పరిణామాలకు దారితీసేలా కనిపిస్తోంది. ఎస్‌బీఐతో రాష్ట్ర ప్రభుత్వానికి ముడిపడి ఉన్న ఆర్థిక సంబంధాలపై పునఃసమీక్ష చేయాలలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఎస్‌బీఓలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న డిపాజిట్లు, అకౌంట్ల వివరాల సేకరణ, ప్రభుత్వ అకౌంట్లను వేరే బ్యాంకులకు మార్చే అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎస్‌బీఐకి భారీ షాక్ తగలనుందని నిపుణులు పేర్కొంటున్నారు.ఎస్‌బీఐ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలం ప్రక్రియపై 3 వారాల పాటు స్టే విధిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ వివాదం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. గతంలో 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లో గల 5 ఎకరాలను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్)కు కేటాయించింది. ఆ తర్వాత ఎస్‌బీహెచ్ కాస్తా ఎస్బీఐలో విలీనమైంది. ఆ భూమిని ఆఫీస్ కాంప్లెక్స్, ఐటీ భవనాల కోసం కేటాయించినప్పుడు.. బ్యాంక్ యాజమాన్యం అప్పట్లోనే రూ.13.33 కోట్లు, ఇతర ఫీజులను ఏపీఐఐసీకి అధికారికంగా చెల్లించింది. దీనికి 2011లోనే ఇరుపక్షాల మధ్య సేల్ అగ్రిమెంట్ కూడా పూర్తి అయింది. ఆ స్థలంలో ఒక ఎస్‌బీఐ బ్రాంచ్‌తోపాటు మూడు ఏటీఎంలను కూడా నిర్మించింది.

# ఆరోగ్యవంతమైన పౌరులే వికసిత భారతానికి బలమైన పునాది: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




హైదరాబాద్, జూన్ 20, 2026:ఆరోగ్యవంతమైన పౌరులే వికసిత భారత నిర్మాణానికి అతిపెద్ద శక్తి అని తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.

బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో శనివారం నిర్వహించిన "టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ సమ్మిట్ అండ్ అవార్డ్స్-- 2026 (సౌత్ ఎడిషన్)" కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత చురుకైన ఆరోగ్య వ్యవస్థల్లో ఒకటిని నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్య సేవలు కేవలం చికిత్సకే పరిమితం కాకుండా 'వికసిత భారత్ ఏ2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.




ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, డిజిటల్ హెల్త్ మిషన్, ఈ-సంజీవని, జన ఔషధి కేంద్రాలు వంటి కార్యక్రమాలు దేశ ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీశాయని గవర్నర్ అన్నారు.

దక్షిణ భారతదేశం, ముఖ్యంగా తెలంగాణ ఆరోగ్య రంగంలో విశిష్టమైన పురోగతి సాధిస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం అత్యాధునిక వైద్య మౌలిక సదుపాయాలు, కొత్త మెడికల్ కళాశాలలు, ప్రపంచస్థాయి వైద్య సంస్థలతో దేశ ఆరోగ్య రంగానికి దిశానిర్దేశం చేస్తోందన్నారు. ఫార్మా, బయోటెక్, వ్యాక్సిన్ తయారీ, మెడికల్ టూరిజం రంగాల్లో తెలంగాణ కృషి ప్రపంచ స్థాయిలో భారత ప్రతిష్ఠను మరింత పెంచుతోందని చెప్పారు.సాంకేతికత, మానవీయ విలువల సమన్వయంతోనే ఆరోగ్యవంతమైన, సమృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత నిర్మాణం సాధ్యమవుతుందని గవర్నర్ పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులను ఆయన అభినందించారు.

# గ్రేటర్ లో ఎన్నికలకు జనసేన కసరత్తు

హైదరాబాద్, జూన్ 20, తెలంగాణలో పోటీ చేస్తామని ప్రకటించిన పవన్ కళ్యాణ్.. ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటికే హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ఉండగా.. తాజాగా మరో కొత్త పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించనున్నారు. తెలంగాణలో జనసేనను బలోపేతం చేయడంలో భాగంగా మణికొండలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. ఇక రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన బరిలో ఉంటామని ప్రకటించిన పవన్.. కసరత్తు మొదలుపెట్టారు.ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ అధికార కూటమిలో భాగం కాగా.. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జనసేన పార్టీ సభ నిర్వహణకు పోలీసులు, హైకోర్టు అనుమతులు ఇవ్వకపోవడం.. అధికార కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేయడంతో.. వాటన్నింటికీ సమాధానంగా.. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని తేల్చి చెప్పిన పవన్ కళ్యాణ్.. ఏ పార్టీ కలిసి వచ్చినా, రాకపోయినా.. ఒంటరిగానైనా బరిలోకి దిగుతామని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే తెలంగాణలోనూ జనసేన పార్టీకి క్షేత్రస్థాయిలో బలం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణపై జనసేన పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన సేన ప్రస్థానం కార్యక్రమంలో తెలంగాణ గురించి ప్రస్తావించడం.. హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస సంఘటనలతో.. పవన్ కళ్యాణ్ తెలంగాణపై దృష్టి పెట్టినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. దీంతో తెలంగాణ జనసేన నేతల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.ఇందులో భాగంగానే రాష్ట్రంలో జనసేన పార్టీని విస్తరించడంలో భాగంగా హైదరాబాద్ మణికొండలో కొత్తగా నిర్మించిన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం పనిచేయనుంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ ఎంసీ) ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా జన సేన పార్టీని బలోపేతం చేయడం తోపాటు.. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఈ కొత్త ఆఫీసును ప్రారంభిం చనున్నట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానని ఇప్పటికే పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కొత్త ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడనున్నారు అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇక ఇప్పటికే పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు, ఆయన పర్యటనలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తుండగా.. తాజాగా జనసేన పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం గురించిఎలాన్వందిస్తారోననేఉత్కంఠ నెలకొంది

పక్కా ప్లాన్ తోజనసేనాని

: తెలంగాణ రాజకీయాల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల ప్రకంపనలు సృష్టించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ఆయన తలపెట్టిన సభను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది. మరోవైపు కవితతో పాటు భారత రాష్ట్ర సమితి నేతలు సైతం టార్గెట్ చేసుకున్నారు. వారిలో ఒక రకమైన భయం కనిపించింది పవన్ కళ్యాణ్ ద్వారా. ఇప్పుడు అదే నిజం చేస్తున్నారు పవన్. తెలంగాణ రాజకీయాల వైపు తొంగి చూస్తున్నారు. అక్కడే ఉండి రాజకీయాలు చేయనున్నారు. హైదరాబాదులో పార్టీ తెలంగాణ కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. ఈరోజు హైదరాబాద్ ఐటీ కారిడార్ మణికొండలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు పొత్తు ద్వారా, సోషల్ మీడియా ద్వారా తెలంగాణలో ప్రాభవాన్ని చాటుకున్న జనసేన.. పార్టీ కార్యాలయాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా తెలంగాణ గడ్డపై సరికొత్త రాజకీయ ప్రస్తానానికి.. అధికారికంగా శ్రీకారం చుట్టబోతుందన్నమాట. × తెలంగాణ నేతల్లో ఆ భయం.. తెలంగాణ రాజకీయ పార్టీల నేతలకు పవన్ కళ్యాణ్ విషయంలో ఒక ఆందోళన ఉంది.. ఏపీలో సైతం పవన్ కళ్యాణ్ చాలా సుదీర్ఘంగా పోరాడి శత శాతం విజయం సాధించారు. ఇక్కడ కూడా అటువంటి ప్రణాళిక రూపొందిస్తే తమకు ఇబ్బందులు తప్పవు అని భయపడుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినం నాడు హైదరాబాదులో ప్రెస్మీట్లో గట్టిగానే సంకేతాలు పంపారు పవన్. రాబోయే ఎన్నికల్లో జనసేన పూర్తిస్థాయిలో బరిలో దిగుతుందని.. ఇక్కడి క్యాడర్ క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని అధికారికంగా ప్రకటించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. ఇప్పుడు ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తెలంగాణ రాజకీయాల్లో సీరియస్ గా దృష్టి పెట్టబోతున్నట్లు స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. × ప్రజల వైఖరిలో మార్పు.. గతం కంటే తెలంగాణ ప్రజల వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో ప్రత్యేక రాష్ట సెంటిమెంట్ ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం ప్రజలు అభివృద్ధికి, సమకాలిన అంశాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. పైగా తెలంగాణలో ప్రస్తుతం రాజకీయ శూన్యత ఉంది. దానిని భర్తీ చేయడమే అజెండాగా జనసేన పని చేయనుంది. భారత రాష్ట్ర సమితి వరుస అపజయాలతో ఇబ్బంది పడుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల కొన్ని వర్గాల్లో అసంతృప్తి ఉంది. బిజెపి బలం పుంజుకున్నప్పటికీ నాయకత్వం సమస్య వెంటాడుతోంది. ఇటువంటి తరుణంలో ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం జనసేన ప్రత్యేక ఓటు బ్యాంకు కొల్లగొట్టాలని చూస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో సెటిలర్స్, ఉద్యోగులు ఉన్న ప్రాంతాల్లో జనసేన బలం పెంచుకోవాలని భావిస్తోంది. యువతతో పాటు విద్యార్థుల ఓట్లపై గురిపెడుతోంది. × సమయం కేటాయింపు.. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. అయితే హైదరాబాదులో నివాసం ఉన్న దృష్ట్యా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అందుకే వారంలో ఒకరోజు తెలంగాణ కార్యకల ాపాలకు కేటాయించే అవకాశం ఉంది.

# డీఎస్సీ డ్యామేజ్ ఎవరికి...

విజయవాడ, జూన్ 20, డీఎస్సీ 2025 విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి షాక్ తప్పలేదు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలు అనేక రకాల అవకతవకలు జరిగాయని గత కొద్ది రోజులుగా ఆరోపణలు చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. జగన్మోహన్ రెడ్డి అయితే తన పక్కన డీఎస్సీ అభ్యర్థులను పెట్టుకుని మరి ఆరోపణలు చేస్తూ వచ్చారు. అయితే ఈ విషయంలో అనుకున్న స్థాయిలో వైసీపీకి ప్రజల్లో మైలేజ్ దక్కలేదు. అలా దక్కలేదు సరి కదా తిరిగి డ్యామేజ్ జరిగింది. దానికి కారణం లేకపోలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు మాదిరిగా కూటమి నుంచి ఎదురుదాడి రాలేదు. ఒక పద్ధతి ప్రకారం అధికారులు మీడియా ముందుకు వచ్చి సుదీర్ఘ వివరణలు ఇచ్చారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నం గా ప్రజలు ఒక అంచనాకు వచ్చారు. అందుకే లైట్ తీసుకుంటున్నారు. మరికొందరైతే అసహ్యించుకుంటున్నారు వైసీపీ తీరుపై. ఎప్పటికప్పుడు స్టాండ్ మార్చుతూ.. డీఎస్సీ విషయంలో వైసిపి ఒక స్టాండ్ తో ముందుకు వెళ్లలేదు. రకరకాల ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. వైసీపీ నుంచి వచ్చిన ఆరోపణలకు కూటమి నేతలు కౌంటర్ ఇచ్చి ఉంటే అది రాజకీయ రగడగా మారి ఉండేది. అందుకే ప్రభుత్వం వ్యూహాత్మకంగా విద్యాశాఖ ఉన్నతాధికారులను రంగంలోకి దించింది. సాక్షి మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాలను కేస్ స్టడీస్ గా తీసుకుంటూ ఒక్కో అనుమానాన్ని నివృత్తి చేశారు. ఎంతో ఓపికగా అధికారులు సమాధానాలు చెప్పారు. దీంతో ఆదిలోనే దానికి కౌంటర్ ఇవ్వగలిగారు అధికారులు. సోషల్ మీడియాలో అధికారులు ఇచ్చే కౌంటర్ ఎక్కువగా ప్రజల్లోకి వెళ్ళింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. లోకేష్ సవాల్ తో.. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్ద ఆధారాలు ఉంటే కచ్చితంగా న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చు అని ప్రభుత్వ వర్గాలు సలహా ఇచ్చాయి. అది కూడా ప్రజల్లోకి వెళ్ళింది. వైసీపీ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు అంటూ ప్రజలు ఒక నిర్ధారణకు కూడా వచ్చారు. అక్కడితో ఆగలేదు. మళ్లీ కమ్మ డీఎస్సీ అంటూ చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ కోటాలో కమ్మ సామాజిక వర్గం వారికి అధిక అవకాశాలు కల్పించారు అంటూ ఆరోపణలు చేశారు. దానిని కూడా నివృత్తి చేసింది విద్యాశాఖ. రెడ్డి సామాజిక వర్గానికి 10 పోస్టులు, కాపు సామాజిక వర్గానికి 16 పోస్టులు ఇస్తే కమ్మ సామాజిక వర్గానికి మాత్రం 9 పోస్టులు కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఆ విషయంలో కూడా ఆ పార్టీకి షాక్ తప్పలేదు. చివరిగా లోకేష్ సాహసించి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు చర్యలను తప్పుపడుతూ.. అవసరం అనుకుంటే జగన్మోహన్ రెడ్డి తనతో చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. దానికి సై అనలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. లక్ష్మీపార్వతి తో పాటు యాంకర్ శ్యామల లాంటి వారిని పంపించారు. మరోసారి డీఎస్సీ విషయంలో చతికిల పడ్డారు. ఈ మొత్తం పరిణామాలతో ప్రజలు ఒక నిర్ధారణకు వచ్చారు. డీఎస్సీ విషయంలో వైసిపి కుట్ర చేస్తుంది అనే అనుమానాలను ఎక్కువమంది నమ్మారు. అంతిమంగా ఇప్పుడు ఈ డీఎస్సీ అంశం అనేది వైసీపీకి ఎక్కువగా డ్యామేజ్ చేస్తోంది. ముమ్ముందు వైసీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# అపసోపాలు పడుతున్న అమరావతి, పోలవరం

విజయవాడ, జూన్ 20, ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకుంది. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ప్రధానంగా వినిపించిన నినాదం ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం . గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ రెండు ప్రాజెక్టులు రివర్స్ టెండరింగ్, విధానపరమైన నిర్ణయాల వల్ల పూర్తిగా నిర్వీర్యమయ్యాయనే బలమైన విమర్శల మధ్య కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు తీవ్రమైన చట్టపరమైన, ఆర్థికపరమైన, సాంకేతికపరమైన సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనల వల్ల అమరావతిలో దాదాపు 45,000 కోట్ల విలువైన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి అడవిని తలపించాయి. అటు పోలవరంలో గైడ్ బండ్ దెబ్బతినడం, డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. మొదటి ఆరు నెలల కాలాన్ని కేవలం నష్ట నివారణ చర్యలు, నిధుల సమీకరణకే కేటాయించాల్సి వచ్చింది. రాజధాని అమరావతిని గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అద్భుతమైన ఆర్థిక పురోగతిని సాధించింది. గత ఐదేళ్ల వైఫల్యాల వల్ల దెబ్బతిన్న అంతర్జాతీయ బ్యాంకుల నమ్మకాన్ని పునరుద్ధరించడంలో చంద్రబాబు విజయవంతమయ్యారు. ప్రపంచ బ్యాంకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ల నుంచి ఉమ్మడిగా 15,000 కోట్ల ప్రత్యేక రుణాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ నిధులతో గతంలో ఆగిపోయిన ఐకానిక్ నిర్మాణాలు ? సెక్రటేరియట్ టవర్స్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ఐఏఎస్, జడ్జీల క్వార్టర్ల నిర్మాణ పనులను నూతన ఎల్అండ్‌టీ , షాపూర్జీ పల్లోంజీ సంస్థలకు అప్పగించి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిలో గత రెండేళ్లలో మౌలిక వసతుల కల్పన 45 శాతం మేర పూర్తయింది. గతంలో నిలిచిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థలతో పాత ఒప్పందాలను పునరుద్ధరించడమే కాకుండా, దాదాపు 12 జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు అమరావతిలో భూములు కేటాయించడం ద్వారా ఈ రెండేళ్లలోనే సుమారు 8,000 కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించగలిగారు. కూటమి ప్రభుత్వానికి అత్యంత సవాలుగా మారింది పోలవరం ప్రాజెక్టు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిగా పునర్నిర్మించాలా లేదా పాతదానికి మరమ్మతులు చేయాలా అనే సాంకేతిక మీమాంసకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం తెరదించింది. దెబ్బతిన్న పాత డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తగా దాదాపు 2,000 కోట్ల అంచనా వ్యయంతో నూతన వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో ప్రారంభించారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో సఖ్యతను ఉపయోగించుకుని, పోలవరం మొదటి దశ పూర్తి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ద్వారా 12,157 కోట్ల అదనపు నిధుల ప్యాకేజీని కూటమి ప్రభుత్వం మంజూరు చేయించుకోగలిగింది. ఈ రెండేళ్ల కాలంలో పోలవరం ప్రధాన డ్యామ్ పనులు, స్పిల్‌వే రేడియల్ గేట్ల అమరిక 85 శాతం పూర్తయింది. కుడి, ఎడమ కాలువల లైనింగ్ పనులు, టన్నెల్ పనులలో గత రెండేళ్లలో 22 శాతం అదనపు పురోగతి నమోదైంది. అత్యంత క్లిష్టమైన 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని పునరావాస ప్రక్రియ కోసం సుమారు 5,000 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఖజానా ఖాళీగా ఉండటం, భారీగా ఉన్న అప్పుల భారం వంటి అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం అమరావతి - పోలవరం ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గడిచిన రెండేళ్ల డేటాను పరిశీలిస్తే.. ప్రచార ఆర్భాటాల కంటే క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల పునరుద్ధరణ, కేంద్రం నుంచి నిధుల రాకపైనే ప్రభుత్వం ఎక్కువ విజయం సాధించిందని స్పష్టమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులను అధిగమించి చూపిస్తున్న ఈ పురోగతి.. రాబోయే మూడేళ్లలో ఏపీ అభివృద్ధి రథాన్ని మరింత వేగంగా ముందుకు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ప్రజలు నమ్మకంతో ఉన్నారు.

# 24 నుంచి బంగారం గనుల తవ్వకాలు

కర్నూలు, జూన్ 20, ప్రైవేట్ భాగస్వామ్యంతో దేశీయ ఖనిజ రంగంలో సరికొత్త రికార్డు సృష్టించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధమైంది. భారతదేశంలోనే తొలిసారిగా భారీ తరహా ప్రైవేట్ బంగారు గని ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించబోతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్ట్ ను ఈ నెల 24న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు.జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ , డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో దాదాపు రూ. 400 కోట్లకు పైగా వ్యయంతో ఈ గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి గ్రామాల్లో విస్తరించి ఉన్న సుమారు 598 హెక్టార్ల లీజు భూమిలో ఈ మైనింగ్ క్షేత్రాన్ని అభివృద్ధి చేశారు. అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాలతో కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే ఇక్కడి ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణాన్ని, పైలట్ రన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రతి ఏటా సుమారు 4 లక్షల టన్నుల బంగారు ఖనిజాన్ని ప్రాసెస్ చేయనున్నారునిక్షేపాల అంచనాల పరంగా జొన్నగిరి గని దేశీయ పసిడి రంగంలో గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ప్రాథమిక అన్వేషణలో జొన్నగిరి ఓపెన్ పిట్ పరిధిలోనే దాదాపు 13,100 కిలోల నిఖార్సైన బంగారు నిల్వలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వేలు స్పష్టం చేశాయి. ఇక మొత్తం లీజు మైనింగ్ ప్రాంతంలో అంచెలంచెలుగా జరిపిన లోతైన పరిశోధనల ప్రకారం.. ఇక్కడ ఏకంగా 42.5 టన్నుల నుండి 50,000 కిలోల వరకు పసిడి నిల్వలు పెరిగే అవకాశం ఉన్నట్లు మైనింగ్ నిపుణులు నిర్ధారించారు. పూర్తిస్థాయి కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభమయ్యాక, ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏడాదికి సగటున 1,000 కిలోల శుద్ధి చేసిన విదేశీ ప్రమాణాల బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ భారీ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో లభించిన ఉత్సాహంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో ఖనిజ సంపద వెలికితీతను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో గుర్తించిన మరో నాలుగు కొత్త గోల్డ్ బ్లాక్‌లను త్వరలోనే బహిరంగ వేలం వేయడానికి మైన్స్ అండ్ జియాలజీ శాఖ కసరత్తు పూర్తి చేసింది. భారతదేశం ప్రతి ఏటా దాదాపు 800 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటూ భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోతున్న తరుణంలో.. కేజీఎఫ్ మూతపడిన తర్వాత ఏర్పడిన లోటును భర్తీ చేస్తూ ఏపీలో ప్రారంభమవుతున్న ఈ జొన్నగిరి ప్రాజెక్ట్ దేశ ఆర్థికాభివృద్ధికి, స్థానిక నిరుద్యోగుల ఉపాధికి పెద్ద బూస్ట్‌గా నిలవనుంది.

# ప్రకాశం వైసీపీకి దిక్కెవరు...

ఒంగోలు, జూన్ 20, వైసీపీకి గట్టి పట్టున్న జిల్లాగా ప్రకాశం జిల్లాకు పేరుంది. అలాంటి జిల్లాలో ఇపుడు ఫ్యాన్ రెక్కలు సరిగ్గా తిరగడం లేదని అంటున్నారు. జిల్లా మొత్తాన్ని నడిపే సమర్థ నాయకత్వం లేదని అంటున్నారు. గతంలో అయితే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంటి చేత్తో జిల్లా రాజకీయాలను చక్కబెట్టేవారు. ఆయన వైసీపీని వీడి జనసేనలో చేరిపోయారు. దాంతో వైసీపీకి నాయకత్వం కొరత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు ప్రకాశం జిల్లాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఇంచార్జిలను అందరినీ ఒకే త్రాటి మీదకు నడిపించే కో ఆర్డినేషన్ లేకుండా పోతోంది అన్న చర్చ సాగుతోంది. జిల్లాలో చూస్తే కూటమి పటిష్టంగా ఉంది. బాలినేని జనసేనలో చేరికతో ఆ పార్టీ కూడా బలం పుంజుకుంది అని అంటున్నారు. ఇటీవల కాలంలో బాలినేనికి పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దాంతో బాలినేని రాజకీయంగా దూకుడు పెంచుతున్నారు. అది వైసీపీకి ఇబ్బందికరంగా మారుతుందా అన్న చర్చ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వైసీపీ ఇంచార్జిలు అంతా యాక్టివ్ మోడ్ లో లేరని విమర్శలు విన వస్తున్నాయి. సొంతంగా స్థానిక సమస్యల మీద పోరు సలపడం లేదు అని అంటున్నారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆందోళన మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు అని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాజ్యసభ సభ్యుడుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి ఎందుకో జిల్లా రాజకీయాల మీద అంతగా ఆసక్తిని చూపించడం లేదని అంటున్నారు. ఇక జిల్లా అధ్యక్షుడుగా జగన్ సన్నిహితుడైన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఎక్కువగా తన సొంత నియోజకవర్గం దర్శి ప్రాంతాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. మరో వైపు చూస్తే అధినేత జగన్ ప్రకాశం జిల్లా మీద ఫోకస్ పెట్టి దిశా నిర్దేశం చేయాల్సిందే అని అంటున్నారు. అక్కడ సరైన నాయకత్వాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కూడా అంటునారు. నియోజకవర్గాల స్థాయిలో బలమైన నేతలు ఉన్నారని అంటున్నారు. అలాగే పార్టీకి మంచి ఓటు బ్యాంక్ కూడా ఉంది. మరి వీటిని దృష్టిలో ఉంచుకుని పార్టీని బలోపేతం చేసే నేతల కోసమే సెర్చ్ చేయాల్సి ఉంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ప్రకాశంలో వైసీపీ వెలుగులు గత కాలం కాంతులు అన్న తీరుగానే ఉంటాయని కూడా అంటున్నారు. ముఖ్యంగా క్యాడర్ అయితే పూర్తిగా అసంతృప్తితో ఉందని కూడా గుర్తు చేస్తున్నారు.

# వైసీపికి విజయసాయిరెడ్డి కావలెను



విజయవాడ, జూన్ 20,చారిత్రాత్మక విజయం వెనుక.. జాతీయ స్థాయిలో తెరవెనుక నడిచిన ఒక భారీ పొలిటికల్ ఆపరేషన్ వెలుగులోకి వచ్చింది. 2020లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ నుండి రాజ్యసభకు వెళ్లిన నత్వానీకి.. ఈసారి ఏపీలో మారిన రాజకీయ సమీకరణాల వల్ల కూటమి నుండి అవకాశం లభించలేదు. దీంతో ఆయన తిరిగి తన పాత అడ్డా అయిన జార్ఖండ్‌కు షిఫ్ట్ అయి, బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి మ్యాజిక్ ఫిగర్‌ను సాధించారు. అయితే, జార్ఖండ్‌లో అధికార ఇండియా కూటమి వ్యూహాలను చిత్తు చేస్తూ నత్వానీ గెలుపు గుర్రం ఎక్కడం వెనుక వైఎస్సార్‌సీపీ మాజీ నేత, విజయసాయిరెడ్డి చాణక్యం అత్యంత కీలక పాత్ర పోషించింది. ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుండి విజయసాయిరెడ్డి రాంచీ వేదికగా తెరవెనుక చక్రం తిప్పారు. నత్వానీ గెలుపునకు బీజేపీ సంఖ్యాబలం కాకుండా అదనంగా అవసరమైన ఆ నలుగురు ఎమ్మెల్యేల ఓట్లను సర్దుబాటు చేయడంలో సాయిరెడ్డే తనకు మాత్రమే సాధ్యమైన మధ్యవర్తిత్వ టాలెంట్‌ను ఉపయోగించారు. జార్ఖండ్ అధికార కూటమి లోని అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని, కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఝా క్యాంపు నుండి ఓట్లను క్రాస్ ఓటింగ్ ద్వారా నత్వానీ వైపు మళ్లించడంలో విజయసాయిరెడ్డి సక్సెస్ అయ్యారు. దిల్లీ లీగల్ సర్కిల్స్‌లో , ఇలాంటి సంక్లిష్టమైన రిసార్ట్ రాజకీయాలు , ఓట్ల సర్దుబాటు, మేనేజ్‌మెంట్ ఆపరేషన్లలో విజయసాయిరెడ్డి ఎంతటి నిష్ణాతుడో ఈ జార్ఖండ్ ఫలితం మరోసారి దేశానికి నిరూపించింది. విజయసాయిరెడ్డి వైఎస్సార్‌సీపీలో ఉన్నంత కాలం అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇటువంటి క్లిష్టమైన సమయాల్లో ఎన్నో చారిత్రాత్మక సేవలు అందించారు. దిల్లీ స్థాయిలో పార్టీకి రక్షణ కవచంగా ఉంటూ, కేంద్ర పెద్దలతో సత్సంబంధాలు నెరపడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. కానీ, తాడేపల్లి ప్యాలెస్‌లోని కొందరు కోటరీ నేతల దెబ్బకు, ముఖ్యంగా సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి వారి మితిమీరిన జోక్యానికి తట్టుకోలేక విజయసాయిరెడ్డి వైసీపీకి దూరం కావాల్సి వచ్చింది. ఇప్పుడు అదే టాలెంట్‌ను ఆయన జాతీయ స్థాయిలో బీజేపీ, ఎన్‌డీఏ సానుభూతిపరులకు, నత్వానీ లాంటి కార్పొరేట్ దిగ్గజాలకు సేవలుగా అందిస్తూ.. దిల్లీ పెద్దల వద్ద తన ప్రాధాన్యతను పెంచుకుంటూ తనను తాను రాజకీయంగా, చట్టపరంగా కాపాడుకుంటున్నారు. జార్ఖండ్‌లో విజయసాయిరెడ్డి చూపించిన ఈ పొలిటికల్ టైమింగ్ , మేనేజ్‌మెంట్ స్కిల్స్ చూశాక.. ఏపీలో ఘోర పరాజయం పాలై ఒంటరిగా మిగిలిపోయిన జగన్ మోహన్ రెడ్డికి కచ్చితంగా కనువిప్పు కలుగుతుందనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం జగన్ చుట్టూ ఉన్న సజ్జల లాంటి కోటరీ నేతలు కేవలం మీడియా ముందు ప్రెస్ మీట్లు పెట్టడానికే పనికొస్తారు తప్ప, ఇలాంటి మైండ్ గేమ్‌లు ఆడటంలో పూర్తిగా విఫలమయ్యారని కేడర్ సైతం గ్రహించింది. ఇవాళ కాకపోతే రేపైనా సరే.. పార్టీ మనుగడ కోసం జగన్ తన చుట్టూ ఉన్న భజన బృందాన్ని, సజ్జల టీమ్‌ను పక్కన పెట్టి, విజయసాయిరెడ్డి లాంటి ట్రబుల్ షూటర్‌ను మళ్లీ గౌరవంగా పార్టీలోకి తెచ్చుకోవడం ఖాయమనే సంకేతాలు వస్తున్నాయి.

## ఇన్స్టాగ్రామ్లో ఫేక్ ఐడీలతో ట్రైనీ ఐపీఎస్ అంటూ యువతులకు వల

## రూ.14 లక్షలు దోచుకున్న నిందితుడు



మెదక్ మెదక్ జిల్లా టెక్మాల్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో నివసిస్తూ ఇన్స్టాగ్రామ్లో తన పేరు రుత్విక్ రెడ్డిగా మార్చుకుని, ఐపీఎస్ ట్రైనింగ్ తీసుకుంటున్నానని అదే గ్రామానికి చెందిన యువతితో ఉప్పరి దుర్గయ్య పరిచయం పెంచుకున్నాడు. ఖర్చులకు డబ్బులు కావాలని, తననే పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.5 లక్షలు, తులం బంగారం కాజేసాడు. సాత్విక్ రెడ్డి పేరుతో మరో ఐడీ సృష్టించి ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన ఓ 17 ఏళ్ల బాలికను ట్రాప్ చేసి, ఎంబీబీఎస్ చదువుతున్నానని నమ్మించి రూ.7 లక్షలు కాజేసాడు. దుర్గయ్య ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయామని గ్రహించి బాధిత యువతులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కూకట్ పల్లి పీఎస్ లో యోగా

రంగారెడ్డి కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ సుబ్బారావు నేతృత్వంలో పోలీసులకు యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే పోలీసులకు యోగ మానసికంగా శారీరకంగా ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు యోగా చేయాలని సూచించారు. రేపు అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని నేడు స్టేషన్ లో ఉన్న పోలీస్ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు కూడా రోజు పాటించాలని కోరారు.

# ఆమె పదవి.. ఆయన పెత్తనం..

ఖమ్మం వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావే శానికి భార్యల వెంట భర్తలు వచ్చారు. ఐదుగురు మునిసిపల్ కౌన్సిలర్ భర్తలు చైర్మన్ భర్త సమావేశంకు హాజరు అయ్యారు. కమిషనర్ రామచంద్రరావు సమావేశంలో చూసి చూడనట్లు వ్యవహరించడం విశేషం. చైర్మన్ కాప చంద్రకళ, కమిషనర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో 89 అంశాలపై ఎజెండా ప్రవేశ పెట్టగా అందులో అధికార పార్టీ వివక్ష తో 79 అంశాలను సానుకూల స్పందనతో 11 అంశాలను తిరస్కరించారు. రెండవ సాధారణ సమావేశం నిర్వహించడంతో తమ వార్డులకు నిధులు ఇవ్వడం లేదని మహిళా కౌన్సిలర్ నిలదీసారు. చైర్మన్ భర్త కాప మురళీకృష్ణ జోక్యం చేసుకొని మహిళ కౌన్సిలర్ కు వేలు చూపించి వ్యవహరించడంతో రగడ మొదలయింది. ఆపై వచ్చిన మిగతా కాంగ్రెస్ మహిళకౌన్సిల్ భర్తలు మండిపడడంతో సమావేశాన్ని ముగించారు

# ఆర్థిక ప్రగతిపై లోకేష్ కొత్త రోడ్‌మ్యాప్

విజయవాడ, జూన్ 20 ఏపీలోని టీడీపీ కూటమిలో యువ మంత్రిగా ఉన్న నారా లోకేష్ జాతీయ స్థాయిలో తన పలుకుబడిని మరింతగా పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ మంత్రిగా ఆయన కేవలం రాష్ట్రానికే పరిమితం కావడం లేదు. అదే సమయంలో ఢిల్లీకి అనేక సార్లు వెళ్ళి వస్తున్నారు. కేంద్ర మంత్రులను విరివిగా కలుస్తున్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా సమావేశం అవుతున్నారు. తాను చురుకైన యువ నేతగా ఏపీ రాజకీయాల్లో ఉన్నాను అని తెలియచేసేందుకు ఈ పర్యటనలు లోకేష్ కి ఎంతగానో దోహదపడుతున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి.కేవలం దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే లోకేష్ పర్యటనలు పరిమితం కావడం లేదు, ఆయన వివిధ రాష్ట్రాలలో కూడా పర్యటిస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాల మీదనే ఈ పర్యటనలు అని ప్రచారం జరుగుతున్నా వాటితో పాటుగా స్వామి కార్యం అన్నట్లు లోకేష్ ఆయా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న నాయకులను ముఖ్యమంత్రులను కలుసుకుంటూ వారితే మమేకం అవుతూ యంగ్ డైనమిక్ లీదర్ గా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నారు.ఇదిలా ఉంటే నారా లోకేష్ తాజాగా పశ్చిమ బెంగాల్ కి వెళ్ళారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారితో కోల్ కతాలో భేటీ అయ్యారు. ఇరువురు నేతలు రెండు రాష్ట్రాలకు సంబంధించిన విషయాలను చర్చించుకున్నారు. ఏపీలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి లోకేష్ సువేందుకు తెలిపారు. ఏపీలో అత్యధిక మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని కూడా చెప్పారు. శిపశ్చిమ బెంగాల్ లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఏపీ బెంగాల్ మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలను మరింత బలోపేతం చేద్దామని సువేందుని లోకేష్ కోరడం విశేషం. ఇదే సందర్భంలో పశ్చిమ బెంగాల్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని, తిరుమలలో పశ్చిమ బెంగాల్ భవన్ నిర్మాణానికి అన్ని విధాలా సాయం అందిస్తామని సువేందుకు లోకేష్ విన్నవించారు.ఇంతకు ముందు ముంబై పర్యటనకు వెళ్ళిన నారా లోకేష్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తో కూడా భేటీ అయి అనేక అంశాలను ముచ్చటించారు. ఇలా లోకేష్ బీజేపీలో కీలకమైన రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువ ముఖ్యమంత్రులతో భేటీలు వేయడం రాజకీయంగా ఆసక్తిని కలిగించే అంశంగానే చూస్తున్నారు ఈ ఇద్దరు నేతలూ బీజేపీలో ఎంతో భవిష్యత్తు ఉన్న వారు కావడం విశేషం. ఇక ఏపీ నుంచి రాజకీయంగా ఎదుగుతున్న నేతగా లోకేష్ ఉన్నారు. దాంతో ఆయన జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ బీజేపీ పెద్దలతో పాటు యువ ముఖ్యమంత్రులతోనూ అదే రకమైన సాన్నిహిత్యం నెరపడం వెనక ముందు చూపు ఉందని అంటున్నారు. రానున్న రోజులలో ఆయన ఇదే తీరులో మరెంత మంది ముఖ్యమంత్రులను కీలక నేతలను కలుస్తారు అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఏది ఏమైనా ఏపీకి చెందిన మంత్రిగా ఉన్న లోకేష్ తన పలుకుబడిని జాతీయ స్థాయిలో ఒక క్రమపద్ధతిలో విస్తరించుకుంటున్నారు అన్న మాట అయితే గట్టిగా వినిపిస్తోంది.

బెంగాల్

జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్ ఏపీ ఆర్థిక ప్రగతిపై సరికొత్త రికార్డు రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోల్‌కతాలో నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా.. ప్రస్తుతం 220 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను భవిష్యత్తులో ఏకంగా 2.4 ట్రిలియన్ డాలర్ల మహా సామ్రాజ్యంగా విస్తరించడమే తమ కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. ఈ అద్భుత వృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలంటూ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార వర్గాలకు ఆయన బహిరంగ పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు ఏ విధంగా దేశంలోనే అత్యంత అనుకూలమైన గమ్యస్థానంగా మారిందో వివరించడానికి మంత్రి లోకేష్ సరికొత్తగా 3హ సూత్రాన్ని తెరపైకి తెచ్చారు. మొదటి 'హ' అంటే స్పీడ్ , రెండో 'హ' స్టెబిలిటీ , మూడో 'హ' సర్వీస్ అని ఆయన అభివర్ణించారు. మీరు మాతో చేతులు కలిపిన మరుక్షణమే.. అది కేవలం మీ ప్రైవేట్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు, మా ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా మారుతుంది. పారిశ్రామికవేత్తలు దశాబ్దాల తరబడి అనుమతుల కోసం తిరిగే రోజులకు ఏపీలో స్వస్తి పలికాం. స్పీడ్ గవర్నెన్స్ ద్వారా నిర్ణీత కాలంలోనే పనులు పూర్తి చేసి చూపిస్తాం అని లోకేష్ కార్పొరేట్ వర్గాలకు గట్టి నమ్మకాన్ని ఇచ్చారు.

ఇదే తరుణంలో జాతీయ స్థాయిలో రాజకీయ స్థిరత్వాన్ని అందిస్తూ, దేశాన్ని సంస్కరణల వైపు నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.ఈ పర్యటనలో భాగంగా ఐసీసీ సదస్సుతో పాటు కోల్‌కతా కేంద్రంగా ఉన్న పలువురు ప్రముఖ జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా వన్-టు-వన్ సమావేశాలు నిర్వహించారు. గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలకు చెందిన టాప్ సీఈఓలతో విడివిడిగా భేటీ అయ్యారు. రాబోయే ఐదేళ్లలో ఏపీలో 78.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు తెచ్చిన నూతన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ గురించి వారికి వివరించారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో భారీ గ్రీన్ ఎనర్జీ హబ్‌ను ప్లాన్ చేస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు.. ఏపీలో ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం, పోర్టు ఆధారిత మౌలిక వసతుల వైపు దృష్టి సారించేలా లోకేష్ తన ప్రతిపాదనలను ముందుంచారు. మంత్రి లోకేష్ ప్రతిపాదించిన ఈ 2.4 ట్రిలియన్ డాలర్ల విజన్, త్రీ ఎస్ ఫార్ములా కోల్‌కతా పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. కేవలం విధానాల ప్రకటనలకే పరిమితం కాకుండా, అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖపట్నంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీ స్థాపన, ఐటీ కారిడార్ల విస్తరణ వంటి ప్రత్యక్ష ప్రాజెక్టులను లోకేష్ ఈ పర్యటనలో ప్రొజెక్ట్ చేశారు.

ల్యాండ్ అక్విజిషన్ వేగవంతం చేస్తామని, పారిశ్రామికవేత్తలకు ఎర్రటి తివాచీ పరుస్తామని మంత్రి లోకేష్ ఇచ్చిన భరోసాతో బెంగాల్‌కు చెందిన పలు మల్టీనేషనల్ కంపెనీలు త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

# కాసులు పండిస్తున్న చీనీ రైతులు

కడప, జూన్ 20, కరువు ప్రాంతంగా పిలిచే రాయలసీమలో రైతులు అద్భుతాలు చేస్తున్నారు. సంప్రదాయ పంటల్ని సాగుచేస్తూనే అధిక లాభాలు అందుకుంటున్నారు. వ్యవసాయ పద్ధతుల్లో చిన్న, చిన్న మార్పులు చేసి సేంద్రీయ ఎరువులతో అరటి, దానిమ్మ, బత్తాయి (చీనీ), మామిడి సాగు చేస్తూ అధిక దిగుబడిని అందుకుంటున్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలో ఆపిల్ సాగు చేసిన రైతు సక్సెస్ అందుకుంటే.. తాజాగా కడప జిల్లాకు చెందిన రైతు సేంద్రీయ ఎరువులతో పాటుగా బిందు సేద్యంతో బత్తాయి సాగు చేసి అధిక దిగుబడితో భారీగా లాభాలు ఆర్జించారు.కడప జిల్లా బి చెర్లోపల్లెకు చెందిన రైతు పేరం రామాంజులురెడ్డి 11 ఎకరాల్లో బత్తాయి సాగు చేశారు. రామాంజులు రెడ్డి మొదటి నుంచి ఉద్యానవనశాఖ అధికారుల సలహాలు పాటిస్తూ తన తోటకు బిందు సేద్యం (డ్రిప్) ఏర్పాటు చేసుకున్నారు. అందరు రైతుల్లా కాకుండా రసాయన ఎరువుల్ని వాడకుండా పేడ ఎరువు, ఆముదం, వేపచెక్క వంటి సేంద్రీయ ఎరువుల్ని మాత్రమే ఉపయోగించారు. బిందు సేద్యంతో పాటుగా సేంద్రీయ ఎరువులు ఉపయోగించడంతో చెట్లు బాగా పెరిగాయి.. చీడపీడల బెడద కూడా లేదు. మిగిలిన రైతులకు ఎకరానికి 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంటే.. రామాంజులు రెడ్డికి మాత్రం ఎకరాకు 14 నుంచి 16 టన్నుల దిగుబడి వచ్చింది. 11 ఎకరాల్లో 180 టన్నుల దిగుబడి సాధించారు.బిందు సేద్యంతో పాటుగా సేంద్రీయ ఎరువుల కారణంగా కాయలు కూడా నాణ్యంగా వచ్చాయి. రామాంజులు రెడ్డి తోటలో కాయలు నాణ్యంగా ఉండటంతో వ్యాపారుల నుంచి మంచి ధర వచ్చింది. ఏకంగా టన్ను రూ. 98వేల నుంచి రూ. 1.05 లక్షల వరకు కొనుగోలు చేశారు. మిగిలిన రైతులు మాత్రం టన్ను రూ. 70వేల నుంచి రూ. 80వేల వరకు మాత్రమే విక్రయించారు. 11 ఎకరాల్లో పెట్టుబడి, మిగిలినవాటికి రూ. 25 లక్షల వరకు ఖర్చు చేశారు. పెట్టుబడి పోను ఆయనకు ఆదాయం దాదాపు రూ. కోటికిపైగా వచ్చినట్లు రైతు రామాంజులు రెడ్డి చెబుతున్నారు. అధికారుల సలహాలను పాటించి సేంద్రీయ ఎరువులు, బిందు సేద్యంతో ఈ రైతు అద్భుతం చేశారు.. అధిక లాభాలు అందుకున్నారు.రాయలసీమ ప్రాంతంలో వర్షపాతం తక్కువగానే ఉంటుంది. అందుకే అక్కడి రైతులు మెట్ట పంటల్ని సాగుచేస్తుండేవారు. కానీ కొన్నేళ్లుగా రైతులు అరటి, దానిమ్మ, బత్తాయి, మామిడిని సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో వినూత్న ప్రయోగాలు చేస్తూ ఆపిల్, ద్రాక్ష వంటి పంటల్ని సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో వినూత్న పద్ధతులతో అధిక దిగుబడి సాధిస్తున్నారు. అనంతపురానికి చెందిన రమణారెడ్డి అనే రైతు ఆపిల్ సాగుతో వార్తల్లో నిలిచారు. తొలి ప్రయత్నంలో విఫలమైనా సరే పట్టుదలతో రెండో ప్రయత్నంలో విజయం సాధించారు. చీనీ సాగు ఎప్పటి నుంచో ఉన్నా సరే రామాంజులు రెడ్డి మాత్రం వినూత్న పద్ధతుల్లో వ్యవసాయం చేసి భారీ లాభాలు పొందారు. సరైన ప్రణాళికతో అధికారుల సూచనలు పాటిస్తూ సేంద్రీయ ఎరువులు ఉపయోగించి సక్సెస్ అయ్యారు..

మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలిచారు రామాంజులు రెడ్డి.కడప జిల్లాలోజీడి మామిడి, సన్న నిమ్మ, జామ, తైవాన్ జామ, సపోటా, నేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ, అంజూర, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, పనస, ఆపిల్ బేర్ సాగును ప్రోత్సహిస్తున్నారు. రోజా, మల్లె, మునగ, ఆయిల్ పామ్, కోకో, రబ్బరు, వెదురు, సిల్వర్ ఓక్, జాట్రా వంటివి కూడా సాగు చేసేలా చూస్తున్నారు. రైతులకు ఉచితంగా మొక్కలు కూడా సరఫరా చేస్తున్నారు. ఈ మొక్కల్ని కుటుంబానికి 5 ఎకరాలు, అంతకంటే తక్కువ భూమి కలిగిన గ్రామీణ ప్రాంత రైతులకు మాత్రమే అందిస్తారు.

## ఒక్క ట్వీట్ మూడు రాష్ట్రాల అలర్ట్

హైదరాబాద్, జూన్ 20, దేశంలోని స్పేస్-టెక్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణాది రాష్ట్రాల మధ్య సోషల్ మీడియా వేదికగా ఒక అపూర్వమైన వ్యూహాత్మక యుద్ధం నడుస్తోంది. ప్రముఖ అంతరిక్ష సాంకేతిక స్టార్టప్ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ చేసిన ఒకే ఒక్క పోస్ట్.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పారిశ్రామిక మంత్రుల మధ్య హైవోల్టేజ్ పోటీకి తెరలేపింది. బెంగళూరు శివార్లలో తమ ఉపగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి భూమిని సేకరించడం ఎంత నరకంగా మారిందో వివరిస్తూ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ చీ లో ఒక పోస్ట్ పెట్టారు. భూమిని సేకరించడం కంటే.. అసలు అంతరిక్షంలోకి వెళ్లే ఉపగ్రహాలను తయారు చేయడమే చాలా సులభం అనిపిస్తోంది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. బెంగళూరు లాంటి గ్లోబల్ టెక్ హబ్‌లో భూసేకరణ, అనుమతుల ప్రక్రియల్లో ఉన్న రెడ్-ట్యాపిజం ను ఈ ట్వీట్ ఎత్తిచూపడంతో పొరుగు రాష్ట్రాలు దీనిని ఒక అద్భుతమైన అవకాశంగా మార్చుకున్నాయి. ఈ పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత వేగంగా స్పందించారు. “క్షితిజ్.. బెంగళూరుకు సరిగ్గా ఆనుకుని, ఇన్వెస్టర్లకు స్వర్గధామం లాంటి అనంతపురం జిల్లా మన పక్కనే ఉంది. అక్కడ మేము స్పేస్ సిటీలు, ఏరోస్పేస్ పార్కులు, రెడీ-టు-గో ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్స్‌ను సిద్ధం చేస్తున్నాం. ఫౌండర్లు భూమి కోసం వేటాడుతూ సమయం వృథా చేసుకోకుండా నేరుగా ఉపగ్రహాల తయారీపై దృష్టి పెట్టవచ్చు. వెల్‌కమ్ టు ఏపీ” అంటూ లోకేష్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీనికి మద్దతుగా ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ కూడా కర్ణాటకను టార్గెట్ చేస్తూ.. “కొన్ని ఎకోసిస్టమ్స్ మిమ్మల్ని అనుమతుల కోసం ఆఫీసుల చుట్టూ పరిగెత్తేలా చేస్తాయి.. కానీ ఆంధ్రప్రదేశ్ మీకు నేరుగా లాంచ్ ప్యాడ్ అందిస్తుంది” అంటూ హాట్ కామెంట్స్ జోడించింది. సొంత రాష్ట్రంలోని స్టార్టప్ పొరుగు రాష్ట్రానికి తరలిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన కర్ణాటక భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెంటనే రంగంలోకి దిగారు. క్షితిజ్ పోస్టుకు రిప్లై ఇస్తూ.. “నా ఆఫీస్ మరియు అధికారులు తక్షణమే మీతో టచ్‌లోకి వస్తారు. మీ సమస్యలను వ్యక్తిగతంగా సమీక్షించి, భూసేకరణ మరియు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తాం” అని హామీ ఇచ్చారు. బెంగళూరు సిలికాన్ వ్యాలీ ట్యాగ్‌ను కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించింది. ఈ బెంగళూరు-ఆంధ్ర వివాదంలోకి తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన అనూహ్యంగా ప్రవేశించారు. హోసూర్ సరిహద్దులో ఉన్న తమిళనాడు ఎందుకు ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకోకూడదని నెటిజన్లు ప్రశ్నించడంతో ఆమె అత్యంత హుందాగా, పవర్‌ఫుల్ కౌంటర్ ఇచ్చారు. తాము గైడెన్స్ తమిళనాడు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇన్వెస్టర్ వెబ్‌సైట్, చీ, లింక్డ్ఇన్, ఈమెయిల్ లేదా కేవలం ఒక చిన్న రెఫరల్.. ఇలా ఏ మార్గంలో క్వెరీ పంపినా, చిన్న ఎంట్రప్రెన్యూర్‌ను కూడా సమానంగా, అత్యంత సీరియస్‌గా తీసుకుంటామని చెప్పారు. భారతదేశంలో ఒకప్పుడు పెట్టుబడుల కోసం ఫౌండర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ ఈరోజు, ఒక స్టార్టప్ ఫౌండర్ పెట్టిన చిన్న అసంతృప్తి ట్వీట్‌కు ముగ్గురు రాష్ట్రాల మంత్రులు పోటీ పడి మరీ నిమిషాల వ్యవధిలో పరిష్కారాలు చూపడం భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పుకు నిదర్శనం. ల్యాండ్ అక్విజిషన్ , రెడ్-ట్యాపిజం వంటి పాత కాలపు అడ్డంకులను తొలగించి, ఇన్వెస్టర్లకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కల్పించడంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సాగుతున్న ఈ ఆరోగ్యకరమైన పోటీ దేశ ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఆన్లైన్ విచారణ కుదరదు..
## అల్లు అర్జున్ కోర్టుకు రావాల్సిందే



హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మొదటి విచారణకు సోమవారం నాంపల్లి కోర్టులో అల్లు అర్జున్ హజరు కానున్నాడు. ముంబైలో మూవీ షూటింగ్లో ఉన్నందున ఆన్లైన్ విచారణకు హాజరవుతానన్న అల్లు అర్జున్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఆన్ లైన్ విచారణ కుదరదు. వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలసిందేనని ఆదేశించింది.

## హై సెక్యూరిటీ జోన్ లలో స్పై కెమెరాలు

ఛండీఘడ్ జూన్ 20, అమృత్సర్‌లోని అత్యంత భద్రతా ప్రాంతాల్లో రహస్యంగా అమర్చిన కెమెరాలు గుర్తించబడ్డాయి. ఈ ప్రాంతాలు సైనిక ఉన్నతాధికారులు తిరిగే ప్రదేశాలు. కెమెరాలు మూడు నెలలుగా పనిచేస్తున్నాయని తెలిసింది. ఇవి సౌరశక్తి (సోలార్ పవర్)తో నడిచే సీసీటీవీ కెమెరాలు. అమృత్సర్ నగరం మొత్తాన్ని కవర్ చేసేలా అమర్చబడ్డాయి. ఈ కెమెరాలు రహస్యంగా ఉండేలా డిజైన్ చేయబడ్డాయి, కాబట్టి వాటిని సాధారణంగా గుర్తించడం కష్టం. శత్రువల చేతికి డేటా.. ఈ కెమెరాలు సిమ్ కార్డుల సాయంతో రికార్డ్ చేసిన దృశ్యాలను నేరుగా పాకిస్తాన్, కెనడాకు పంపుతున్నాయి. ముఖ్యంగా, భారత సైన్యం యొక్క ఎక్స్ కార్ప్స్, హెడ్‌క్వార్టర్స్, సైనిక హౌసింగ్ కాలనీలు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, విమానాశ్రయం వంటి సున్నితమైన ప్రాంతాలను లైవ్‌గా నిఘా వేస్తున్నాయి. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు ఈ దృశ్యాలను నేరుగా చూస్తున్నట్లు సమాచారం వెల్లడైంది. సోలార్ పవర్ వల్ల కెమెరాలు రాత్రింబగళ్లు పనిచేయగలిగాయి, సిమ్ కార్డులు దూర ప్రాంతాలకు డేటా పంపడానికి సహాయపడ్డాయి. ఇద్దరి అరెస్టు.. ఈ వ్యవహారంలో ఇద్దరు వ్యక్తులను అమృత్సర్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. వారి సహాయంతో కెమెరాలు అమర్చినట్లు, డేటా ప్రసారం చేసినట్లు తేలింది. పోలీసులు ఈ కెమెరాలు ఎలా అమర్చబడ్డాయి, ఎవరి సహాయంతో అనే విషయాలపై విస్తృతంగా విచారణ చేస్తున్నారు. ఈ అరెస్టులు ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా పరిశీలించడానికి సహాయపడ్డాయి. ఎలా గుర్తించారు.. ఈ రహస్య కెమెరాలు భద్రతా దళాలు నిర్వహించిన రొటీన్ నిఘా పర్యటనలో గుర్తించబడ్డాయి. సాధారణంగా ఇలాంటి ప్రాంతాల్లో అదనపు పరికరాలు ఉన్నాయేమో అని తనిఖీ చేస్తుంటారు. ఈ కెమెరాలు చిన్నవిగా, రహస్యంగా ఉండటం వల్ల మొదట్లో గుర్తించడం కష్టం అయింది. కానీ సాంకేతిక పరిశీలనలో వాటి ఉనికి బయటపడింది. భద్రతకు సవాల్.. ఈ సంఘటన జాతీయ భద్రతపై తీవ్రమైన సవాల్‌గా మారింది. సైనిక ఉన్నతాధికారుల కదలికలు, ముఖ్యమైన సంస్థలు, విమానాశ్రయం వంటి సున్నితమైన ప్రాంతాలపై రహస్య నిఘా ఏర్పాటు చేయడం అనేది సాధారణ నేరం కాదు. ఇది విదేశీ శక్తులు లేదా ఉగ్రవాద సంస్థలు భారతదేశంలో ఎలా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయో చూపిస్తుంది. సోలార్ పవర్, సిమ్ కార్డుల ఉపయోగం ఈ కెమెరాలను గుర్తించడం కష్టతరం చేసింది. దృశ్యాలు నేరుగా పాకిస్తాన్, కెనడాకు వెళ్లడం అంతర్జాతీయ కోణాన్ని కూడా సూచిస్తుంది. ఇది భారతదేశం యొక్క భద్రతా వ్యవస్థలో లోపాలను బయటపెట్టింది. అయితే, ఈ సంఘటన నుంచి ముఖ్యమైన పాఠం ఏమిటంటే భద్రతా ప్రాంతాల్లో నిరంతర నిఘా, సాంకేతిక పర్యవేక్షణ అవసరం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, సాంకేతిక సామర్థ్యాలు మెరుగుపరచడం, అంతర్జాతీయ సహకారం పెంచడం, స్థానిక స్థాయిలో అప్రమత్తత పెంచడం అవసరం

## మూడేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

మేడ్చల్ చింతల్ లోని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేపీ వివేకానంద మీడియా సమావేశం నిర్వహించారు. అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మూడేళ్లుగా మోసం చేస్తుందని మండి పడ్డారు. రాష్ట్ర నాయకుల మాట నమ్మకం లేక రాహుల్ గాంధీ ని రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు డిక్లరేషన్ ఇస్తామని ..అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇవ్వాళ రైతుల ఉసురు తీస్తుంది అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వారి ప్రాణాలను తీస్తుంది. వ్యవసాయం కోసం బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను రద్దు చేసి, రైతుల ను నిండా ముంచిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది. రైతుబంధు వేయలేక,వ్యవసాయానికి అవసరమైన ఎరువులు ఇవ్వలేక రైతులను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు.రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చేయాలి.లేదంటే రైతుల తరుపున బి ఆర్ ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు.

## యోగా కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించిన
## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



సికింద్రాబాద్ ఆదివారం జరగబోయే యోగా దినోత్సవ 24గంటల కౌంట్ డౌన్ కు సంబంధించి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.రేపు ఉదయం 5:30 నిమిషాలకు ప్రారంభం కానున్న యోగ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, పలువురు సినీ, క్రీడా,రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 2014 లో ఐక్యరాజ్యసమితి జూన్ 21 రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించినప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా భారత విదేశాంగ శాఖ కార్యాలయాలు ఉన్న వివిధ దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యోగ అనేది మానవ జీవితంలో అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న అంశమని ఆయన అన్నారు. భారతీయ అతి ప్రాచీన సంస్కృతిలో భాగంగా ఉన్న యోగాను ప్రధాని మోడీ ప్రపంచానికి పరిచయం చేశారని స్పష్టం చేశారు. మానసిక ప్రశాంతతకు శారీరక ఉల్లాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా రోజున విధిగా యోగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. యోగ దినోత్సవం కార్యక్రమానికి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సామాజిక కార్యకర్తలు ఆరోగ్య నిపుణులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

# రెబల్స్ ఎత్తులు..దీదీ పై ఎత్తులు

న్యూఢిల్లీ, జూన్ 20 తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు తృణమూల్ కాంగ్రెస్ శుక్రవారం వినతిపత్రం అందజేసింది. రెబల్స్‌పై వేర్వేరుగా మొత్తం 20 అనర్హత పిటిషన్లను ఓం బిర్లాకు అందించినట్లు మమతా బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (లో విలీనమయ్యామని, సభలో తమను ఒక ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని రెబెల్ ఎంపీలు చేసిన వాదన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. సమావేశం అనంతరం మాట్లాడిన బెనర్జీ.. రెబెల్ ఎంపీలు అంతకుముందే స్పీకర్‌ను కలిసి తమను తాము ఒక ప్రత్యేక గ్రూపుగా పరిచయం చేసుకున్నారని చెప్పారు."20 మంది స్పీకర్‌ను కలిసి తమను ఒక ప్రత్యేక గ్రూపుగా పరిగణించాలని కోరారు. ఆ తర్వాత, ఆ ఎంపీలు ఔఅఖఎ అనే మరో పార్టీలో చేరినట్లు చెప్పుకున్నారని మాకు తెలిసింది.. ఈ గ్రూపు పేరు ఎవరూ వినలేదు.. కనీసం వారు కూడా ఈ పార్టీ పేరు వినలేదు.. పదో షెడ్యూల్‌లోని సెక్షన్ 2 ప్రకారం, ఒక సభ్యుడు స్వచ్ఛందంగా తన అసలు పార్టీ సభ్యత్వాన్ని వదులుకుంటే, అతడు తన సీటును కోల్పోతాడు... కాబట్టి, వారు ఒక పార్టీ గుర్తుపై గెలిచి, రెండేళ్ల తర్వాత కొత్త పార్టీలో చేరుతున్నామని చెబుతుంటే వారు సభ్యత్వాన్ని రద్దు చేయాలి" అని ఆయన అన్నారు. "ఈ పిటిషన్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మేము డిమాండ్ చేశాం... మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా చెప్పింది" అని అభిషేక్ వ్యాఖ్యానించారుప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు లేదా నాయకుడి నియామకం వంటి రెబల్స్ ఇతర డిమాండ్లను ఆయన ద్వితీయమైనవిగా పేర్కొన్నారు. రెబల్స్ కోరుకుంటే భవిష్యత్ ఎన్నికలలో ఏ పార్టీ టిక్కెట్‌పైనైనా పోటీ చేయవచ్చని, అయితే పార్టీని వీడటం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలను వారు ముందుగా ఎదుర్కోవాలని బెనర్జీ అన్నారు. వారు రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్నారని ఆయన ఆరోపించారు.'వారు పదో షెడ్యూల్‌ను అపహాస్యం చేశారు.. వారు తమ మనస్సాక్షిని, గౌరవాన్ని అమ్ముకున్నారు. బెంగాల్ ప్రజలు వారిని క్షమించరు" అని అభిషేక్ బెనర్జీ మండిపడ్డారు. "వారికి కేంద్ర భద్రత ఉంది. అది పోవాలి. ఎవరూ వారితో నిలబడరు. వారు ఈడీ, సీబీఐలకు భయపడి పార్టీని వీడారు. కోట్లాది రూపాయల ఆశ చూపి, బెదిరింపులతో, భయాలతో ఇలా చేశారు. ఇక్కడ సమాన అవకాశాలు లేవు." అని పేర్కొన్నారుమహారాష్ట్రలోని శివసేనలో ఇటీవల జరిగిన పరిణామాలను కూడా అభిషేక్ ప్రస్తావించారు "మహారాష్ట్రలో శివసేనను విచ్ఛిన్నం చేయడానికి వారు ఎలా ప్రయత్నిస్తున్నారో మనం చూశాం.. వారు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలలో పోటీ చేయడం లేదు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తున్నారు" అని బీజేపీపై బెనర్జీ ఆరోపణలు చేశారు.రెబల్స్‌ను ఒక ప్రత్యేక వర్గంగా గుర్తించాలన్న డిమాండ్‌పై నిర్ణయం తీసుకునే ముందు, తన అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా తృణమూల్ కాంగ్రెస్ లోక్‌సభ నేతను స్పీకర్ ఆహ్వానించిన నేపథ్యంలో శుక్రవారం ఈ సమావేశం జరిగింది. జూన్ 10న తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఒక ప్రత్యేక వర్గంగా చెప్పుకుంటున్న ఏ గ్రూపునకు కూడా ఎలాంటి గుర్తింపు, హోదా లేదా సౌకర్యం కల్పించవద్దని కోరుతూ బెనర్జీ స్పీకర్‌కు లేఖ రాశారు.ప్రస్తుతం ఉన్న ఒక రాజకీయ పార్టీలోనే మరొక ప్రత్యేక గ్రూపుగా ఏర్పడటానికి రాజ్యాంగం, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అనుమతించవని ఆయన వాదించారు.

తృణమూల్ కాంగ్రెస్‌ను ఒకే ఒక రాజకీయ పార్టీగా పరిగణించాలని, సభలో దాని ద్వారా అధికారికంగా నియమించిన నాయకుడు, విప్ ద్వారా మాత్రమే ఆ పార్టీకి ప్రాతినిధ్యం ఉండాలని బెనర్జీ కోరారు. అలాగే ఈ విషయంపై తమ వాదనను వినిపించడానికి పార్టీకి ఒక అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

మహారాష్ట్ర రాజకీయ సంక్షోభం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును బెనర్జీ ఇక్కడ ఉదహరించారు.

పదో షెడ్యూల్ కింద పార్టీలో చీలిక వచ్చింది అనే వాదనను సమర్థించుకునే అవకాశం ఇకపై లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత చట్టపరమైన నిబంధనల ప్రకారం ఒకే ఒక రాజకీయ పార్టీని గుర్తించాల్సి ఉంటుందని, అంతే తప్ప పార్టీలోని ప్రత్యర్థి వర్గాలకు గుర్తింపు ఇవ్వడం కుదరదని ఆయన స్పష్టం చేశారు.

## రైతాంగ సమస్యలపై 30న చలో విజయవాడ

## బద్వేలు రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు (సిపిఐ)



బద్వేలు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమైందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రూరల్ కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానియేల్ పేర్కొన్నారు శనివారం జేవిభవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ అన్ని పంటలకు గిట్టుబాటు ధర, చట్టబద్ధత కల్పించాలని, రైతులకు రెండు లక్షల పంట రుణమాఫీ చేయాలని, అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ, పంట బీమా ఇన్పుట్ సబ్సిడీ బకాయలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎరువులు విత్తనాలు డిజిల్ ధరలు తగ్గించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా, మరియు, 50 ఏళ్ల పైబడిన రైతులకు 10000 వేలు, నెలసరి పెన్షన్ ఇవ్వాలని ఈనెల 30వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించబడుతున్నదని ఆత్మహత్యలనుండి రైతాంగాన్ని రక్షించుకొనుటకు, మన హక్కుల సాధన కొరకు, బద్వేలు రూరల్ ప్రాంతంలోని రైతులంతా తరలిరావాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రూరల్ రైతు నాయకులు, వెంకటరమణ, అబ్రహం, పార్టీ నాయకులు సుధాకర్ ,ప్రసాద్ పాల్గొన్నారు

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి :

## ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. శనివారం ఆయన ఆకస్మికంగా మచిలీపట్నం బస్టాండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఇటీవల బస్టాండ్ దుస్థితిపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో స్పందించిన ఎంపీ, వర్షాలు కురిసినప్పుడు బస్టాండ్ మొత్తం నీటమునిగిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో పేరుకుపోయిన నీరు, పారిశుద్ధ్య సమస్యలు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా బస్టాండ్‌ను ఆధునీకరించి సుందరీకరించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) నిధులను వినియోగించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఎంపీ ఆదేశించారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.బస్టాండ్ సముదాయాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధుల సమీకరణకు తాను కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఎంపీ పర్యటనతో బస్టాండ్ సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు చేపట్టే అవకాశం ఉందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

# కృష్ణలంక స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల విచారణ

విజయవాడ కృష్ణలంక స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల విచారణ కొనసాగింది. గత నెలలో జరిగిన గుర్తుతెలియని మృతదేహాల ఖననంపై పటమట సీఐ పవన్ కిషోర్ విచారణ చేపట్టారు. స్వర్గపురి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్వర్గపురి ఎలక్ట్రిక్ ఫర్నస్ ఆపరేటర్ బాష ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. బాషా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనాథ మృతదేహాలను దహనం చేయడానికి ప్రొసీజర్ ఫాలో అయ్యారా లేదా అనే కోణంలో విచారణ కొనసాగింది. మృతదేహాలను ఖననం చేసే ముందు రికార్డ్ మెయింటెయిన్ చేశారా అని ప్రశ్నించారు.

# యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

## అపోలోలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ముగింపు వేడుకల్లో వైస్ ఛాన్సలర్

## డాక్టర్ హెచ్. వినోద్ భట్ పిలుపు

చిత్తూరు, జూన్ 21: యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, ఆరోగ్యవంతమైన జీవనశైలికి మార్గదర్శకమని ది అపోలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్



భట్ అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అపోలో నాలెడ్జ్ సిటీలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ముగింపు వేడుకల్లో వైస్ ఛాన్సలర్ డిజిగ్నేట్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు కొద్దిసేపైనా యోగాభ్యాసం ప్రారంభించి, క్రమంగా 45 నిమిషాల పాటు సాధన చేస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని చెప్పారు. యోగా మనస్సు, శరీరం, ఆలోచనల మధ్య సమతుల్యతను పెంపొందిస్తుందని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుతుందని వివరించారు. ఆరోగ్య పరిరక్షణలో అపోలో సంస్థలు యోగాకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఈ కార్యక్రమాల్లో ఈషా ఫౌండేషన్ భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు.అపోలో నాలెడ్జ్ సిటీ యోగా అండ్ మెడిటేషన్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 20 వరకు నిర్వహించిన యోగా ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని యోగా యాంథమ్‌తో ప్రారంభించగా, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అసిస్టెంట్ డీన్, యోగా అండ్ మెడిటేషన్ క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ కవిత గత పది రోజుల కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. యోగా అవగాహన కార్యక్రమాలు, సాధన శిబిరాలు, సూర్య నమస్కార ఛాలెంజ్, క్యాంపస్ యోగా రీల్ ఛాలెంజ్‌లలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సూర్య నమస్కార ఛాలెంజ్?2026, క్యాంపస్ యోగా రీల్ ఛాలెంజ్?2026 విజేతలకు వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, వైస్ ఛాన్సలర్ డిజిగ్నేట్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్‌లు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ ఎస్., ఈషా యోగా రిసోర్స్ పర్సన్లు నందకుమార్, ఐశ్వర్య, డీన్‌లు డా. రామయ్య ఇటుమల్ల, డా. డి. జగదీశన్, అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డా. జయంతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్లు దిలీప్, సుమలత, స్టూడెంట్ అఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డేనియల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్ రూ.800 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎమ్మార్వో కార్యాలయం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నె క్రిశాంక్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ళలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇంటికి పునాది కూడా వేయలేదు.. గత కేసీఆర్ ప్రభుత్వం ఒక కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రేవంత్ రెడ్డి ఆయన ఎమ్మెల్యేలు ఎక్కడ భూమి కనబడితే అక్కడ కబ్జా చేస్తున్నారు. ఇవాళ ఏకంగా రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ రూ.5 కోట్లు తీసుకొని గప్ చుప్ ఉన్నాడు. ఏ ఛానల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చర్చకు వస్తారో రావాలి, రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమిలో 6000 ఇందిరమ్మ ఇల్లు కట్టే బదులు, కమిషన్ల కోసం షాపింగ్ మాల్ కట్టడానికి కబ్జా ఎలా జరిగిందో చర్చిద్దాం . 2023 19 ఆగస్టులో కబ్జాదారులపై అప్పటి ప్రభుత్వం పోలీసు కేసులు కూడా నమోదు చేసిందని అన్నారు.

# గుండ్ల సింగారంలో ఉద్రిక్తత.. 360 గుడిసెల తొలగింపు

హనుమకొండ గుండ్ల సింగారంలో లిక్కర్ ప్లాంట్ సమీపంలో సర్వే నంబర్ 174లో ఐదేళ్లుగా సుమారు 360 కుటుంబాలు నివసిస్తున్నాయి.శనివారం తెల్లవారుజామున 5 గంటలకు జేసీబీ లతో గుడిసెలను అధికారులు నేలమట్టం చేసారు. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు పొంది ఇక్కడే జీవిస్తున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు. నిరసన తెలిపిన సుమారు 30 మందిని పోలీసులు కేయూ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం

## తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్తంభించిన యూరియా యాప్ ఆందోళనలో అన్నదాతలు

హైదరాబాద్ శనివారం నాడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యూరియా యాప్ స్థంభించింది. ఎన్నిసార్లు ఓపెన్ చేసినా నాట్ ఫౌండ్, ఎర్రర్ అంటూ యూరియా బుకింగ్ యాప్ మొరాయించింది. యాప్ వైఫల్యంతో రైతులు గంటల తరబడి మొబైల్స్ ముందే పడిగాపులు కాసారు. యాప్ను వెంటనే రద్దు చేసి యూరియా అందించాలని డిమాండ్ చేసారు.

## హైదరాబాద్‌లో ఓంంఅఎఅూఔ 2026 ప్రారంభం: కోక్లియర్ ఇంప్లాంట్‌పై మేధోమథనం

హైదరాబాద్‌లో జూన్ 20, 21 తేదీల్లో 'ఓంంఅఎఅూఔ 2026' జూబ్లీహిల్స్ మా ఇంటి హాస్పిటల్ లో ఈ సదస్సును ప్రారంభించారు. ఓమోఊ, మా ఈఎన్‌టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో, ంజఏఔమోఊఆ సహకారంతో "ఫ్రమ్ సైన్స్ టూ క్లినికల్ ప్రాక్టీస్" థీమ్‌తో ఈ సదస్సు జరుగుతోంది. ఖీఅఎ గుర్తింపు పొందిన ఈ కార్యక్రమంలో 150 మంది ఈఎన్‌టీ వైద్యులు, ఆడియాలజిస్టులు పాల్గొన్నారు. వినికిడి లోపమున్న చిన్నారుల్లో మాట్లాడే సామర్థ్యం పెంపు, అత్యాధునిక కోక్లియర్ ఇంప్లాంట్ టెక్నాలజీలు, క్లినికల్ సవాళ్లపై నిపుణులు చర్చించారని ఓమోఊ చైర్మన్ జి. సునీత కుమార్ తెలిపారు. 2004 నుంచి 750+ విజయవంతమైన ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేసిన మా ఈఎన్‌టీ హాస్పిటల్స్, ఆడిటరీ-వెర్బల్ థెరపీతో చిన్నారులను ఇంజనీర్లు, కార్పొరేట్ ఉద్యోగులుగా తీర్చిదిద్దిందని ఆమె పేర్కొన్నారు. ఇంప్లాంట్ అర్హత, శస్త్రచికిత్స విధానాలు, మ్యాపింగ్‌పై రెండు రోజుల పాటు ప్యానెల్ చర్చలు జరగనున్నాయి. ఆధారాధారిత వైద్య సేవలతో రోగులకు మెరుగైన ఫలితాలు అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## మెహదీపట్నం డిపోలో టీజేఎంయూలో భారీ చేరికలు

హైదరాబాద్‌లోని మెహదీపట్నం డిపోలో తెలంగాణ జర్నీ మెన్ యూనియన్ (ఎఏఓజ)లో భారీ సంఖ్యలో కార్మికులు చేరారు. టీఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్‌తో పాటు పలు ఇతర యూనియన్లకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా టీజేఎంయూలో చేరి సంఘానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కొత్తగా చేరిన సభ్యులకు స్వాగతం పలికి సంఘం లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు.కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యల కోసం టీజేఎంయూ నిరంతరం పోరాటం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడంలో యూనియన్ కీలక పాత్ర పోషిస్తోందనే నమ్మకంతోనే పలువురు ఉద్యోగులు టీజేఎంయూలో చేరారని తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మెహదీపట్నం డిపోలో జరిగిన ఈ భారీ చేరికలు టీజేఎంయూ బలోపేతానికి నిదర్శనమని, భవిష్యత్తులో మరింత మంది కార్మికులు సంఘంలో చేరే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని వారు పిలుపునిచ్చారు.

# 16 రకాల ఔషధాల తయారీ, అమ్మకాలు, పంపిణీని పై కేంద్రం నిషేదం



న్యూ డిల్లి జూన్ 20 : 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) ఔషధాల తయారీ, అమ్మకాలు, పంపిణీని కేంద్రం నిషేధించింది. ఈ ఔషధాలకు శాస్త్రీయపరమైన ఆధారాల్లేవని నిరూపితమైనట్టు పేర్కొంది. ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం, ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహించడం, శాస్త్రీయంగా ధ్రువీకరించిన ఔషధాలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటం కోసమే ఈ చర్య తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కీలక నిర్ణయం

ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలు అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ ఫార్మాస్యూటికల్ పదార్థాలను ఒకే మోతాదులో కలిపి తయారుచేసేవి. ఈ తరహా ఔషధాల వినియోగం, తయారీపై సుప్రీంకోర్టు ఇటీవలే కీలక ఆదేశాలిచ్చింది. దీంతో వివిధ ఔషధాల కలయికలను పరిశీలించి వాటిలో అహేతుకమైనవి, చికిత్సాపరంగా హాని కలిగించే అవకాశం ఉన్నవాటిని గుర్తించడానికి 'డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు' ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.

16 రకాల ఔషధాలపై నిషేధానికి సిఫార్సు

ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల పనితీరుపై డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుకు చెందిన నిపుణుల కమిటీ సమీక్ష జరిపింది. ఆ తర్వాత చికిత్స మెరుగుదలకు ఎలాంటి ప్రయోజనం లేని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. ఈ మేరకు యాంటిబయాటిక్స్, టాపికల్, కాస్మోటిక్స్‌కు చెందిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్లను కేంద్రం బ్యాన్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఏముందంటే?

"16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాల తయారీ, అమ్మకం, సరఫరా, పంపిణీపై దేశవ్యాప్తంగా తక్షణమే నిషేధం అమల్లోకి వస్తుంది. ఈ కాంబినేషన్ డ్రగ్స్ వల్ల రోగం నయం అవుతుందనడానికి ఎలాంటి శాస్త్రీయపరమైన ఆధారాల్లేవు. నిషేధించిన ఔషధాల్లో కొన్ని చర్మ సంబంధిత మందులు, పెయిన్ కిల్లర్స్, కండరాల నొప్పుల మందులు (యాంటిస్పాస్మోడిక్), యాంటీబయాటిక్స్ ఉన్నాయి" అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశాలు

1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 లోని సెక్షన్ 26ఏ ప్రకారం ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధం విధించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహించడానికి, రోగి భద్రతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఈ చర్య ఒక భాగమని వెల్లడించింది. వివరణాత్మక శాస్త్రీయ సమీక్షల తర్వాత గత కొన్నేళ్లుగా అనేక రకాల అహేతుకమైన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధించినట్లు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లు, నియంత్రణ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఔషధాల తయారీదారులు, దిగుమతిదారులు, పంపిణీదారులు, ఇతర భాగస్వాములకు కూడా చట్టానికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

కేంద్రం నిషేధం విధించిన ఎఫ్‌డీసీ ఔషధాలు ఇవే!

అసిటైల్ సాలిసిలిక్ యాసిడ్ విత్ ఎథోహెప్టాజైన్, డిసైక్లోమైన్, పారాసిటమాల్, క్లిడినియం బ్రోమైడ్ వంటి ఔషధాల కలయికపై కేంద్రం నిషేధం విధించింది. అలాగే గ్లిక్లాజైడ్ విత్ క్రోమియం పికోలినేట్, పారాసిటమాల్ కాంబినేషన్‌తో లిగ్నోకైన్ వంటివి ఉన్నాయి. అమోక్సిసిలిన్ విత్ సెర్రాటియోపెప్టిడేస్, సెర్రాటియోపెప్టిడేస్, లాక్టోబాసిల్లస్ స్పోరోజెనస్, సెఫురోక్సిమ్ విత్ సెర్రాటియోపెప్టిడేస్ వంటి అత్యధికంగా వాడే యాంటీబయాటిక్ కాంబినేషన్లపై కూడా నిషేధం పడింది.

విటమిన్-ఈ, జోజోబా ఆయిల్, ఆరెంజ్ ఆయిల్, వీట్ జెర్మ్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్ వంటివి కలిపి తయారుచేసే పలు డెర్మటోలాజికల్ లోషన్లపై కూడా కేంద్రం నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. అల్లంటోయిన్, డీ-పాంథెనాల్ వంటి పదార్థాల కలయికతో కూడిన అనేక చర్మవ్యాధి, చర్మ సంరక్షణ ఫార్ములేషన్లు కూడా నిషేధం ఎదుర్కొన్న జాబితాలో ఉన్నాయి.

# చార్మినార్‌లో అనుమతి లేని ఫాస్ట్ ఫుడ్ గోదాముపై దాడి చేసిన హెచ్-ఫాస్ట్ బృందం కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం







హైదరాబాద్ ఆహార కల్తీ మరియు అసురక్షిత ఆహార పద్ధతులపై నిరంతర నిఘాలో భాగంగా, హెచ్-ఫాస్ట్ హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ బృందం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తో కలిసి చార్మినార్‌లోని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక ఫాస్ట్ ఫుడ్ గోదాముపై ఆకస్మిక దాడి నిర్వహించింది.నమ్మకమైన సమాచారం మేరకు, ఈ బృందం చార్మినార్‌లోని పంచ్ మొహల్లా, న్యూ లాడ్ బజార్‌లో ఉన్న మెసర్స్ అల్ అక్బర్ ఫాస్ట్ ఫుడ్ అండ్ గోడౌన్ ప్రాంగణాన్ని తనిఖీ చేసింది.ఈ తనిఖీలో, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే విధంగా అత్యంత అపరిశుభ్రమైన మరియు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఆహార పదార్థాలను తయారు చేయడం మరియు నిల్వ చేయడం జరుగుతున్నట్లు గుర్తించారు.నిర్బంధ ఎఫ్ ఎస్ ఏఎస్ ఎల్ లైసెన్స్ లేకుండా నిర్వహించడం.నిషేధించబడిన-కృత్రిమ ఆహార రంగులను ఎంఎస్ కె లయన్ గ్రీన్ మరియు రాస్ప్‌బెర్రీ రెడ్, ఉపయోగించడం.పాడైపోయిన మరియు ప్రమాదకరమైన వంట నూనెను పదే పదే ఉపయోగించడం.నీటి విశ్లేషణ ధృవీకరణ మరియు నాణ్యత నియంత్రణ చర్యలు లేకపోవడం.విపరీతమైన అపరిశుభ్ర వాతావరణం, కీటకాల నియంత్రణ. స్వాధీనం చేసుకున్న వివరాలు:సుమారు 110 కిలోల తయారు చేసిన ఫ్రైడ్ చికెన్6 టిన్నుల వంట నూనె ఒక్కొక్కటి 15 లీటర్లు,కృత్రిమ రసాయన ఆహార రంగులుఈ అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఇద్దరు బాధ్యులను అదుపులోకి తీసుకున్నారు.అసురక్షిత ఆహార పద్ధతులపై అధికారులకు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుల కొరకు టోల్-ఫ్రీ నంబర్: 8712661212 ను సంప్రదించండి.ఆహార భద్రత మరియు ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో అవసరం.

# జూబ్లీహిల్స్‌లో బంగారు ఆభరణాల చోరీ.. నలుగురు ఉద్యోగులపై కేసు

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రముఖ జ్యువెలరీ షోరూంలో బంగారు ఆభరణాల చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. షోరూం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట రోడ్డులోని విస్లింగ్ వుడ్స్ అపార్ట్‌మెంట్‌కు చెందిన దోసపాటి కార్తీక్ (39), జూబ్లీహిల్స్‌లోని ఎస్‌కేటీ గోల్డ్ అండ్ డైమండ్స్ (మాజీ విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్) షోరూం యజమాని. షోరూంలో స్టాక్ వెరిఫికేషన్ నిర్వహించగా, మరమ్మతుల కోసం ఉంచిన బంగారు ఆభరణాల్లో 8.2 గ్రాముల బంగారం కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. అనంతరం జూన్ 10న కస్టమర్‌కు చెందిన నమూనా బంగారు గొలుసుతో పాటు మరో రెండు బంగారు వస్తువులు కూడా మాయమైనట్లు తేలింది.సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా అనుమానాస్పద కదలికలు కనిపించడంతో ఉద్యోగులపై అనుమానం వ్యక్తమైంది. గత ఏడాది జూలై 13న కూడా 38.020 గ్రాముల బంగారు గొలుసు షోరూం నుంచి కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ తొలగించబడినట్లు తెలిపారు.మొత్తం 76.385 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వాటి విలువ సుమారు రూ.1.52 లక్షలుగా ఉంటుందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. షోరూం ఉద్యోగులు శివకుమార్ భూక్యా, చలపతిరావు, ప్రకాష్, గోవర్ధన్ కలిసి ఈ చోరీలకు పాల్పడి ఉంటారని అనుమానిస్తూ ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు న్యాయ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి మున్సిపల్ కమిషనర్ కు కార్మికుల వినతి పత్రం నరసరావుపేటలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన




నరసరావుపేట, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం నరసరావుపేట మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేయడం జరిగినది. తదనంతరం నరసరావుపేట మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, పెరుగుతున్న జనాభా ప్రకారం మునిసిపాలిటీ విస్తరణలో భాగంగా అదనంగా కార్మికులను నియమించి పని భారం తగ్గించాలి మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ, పిఆర్సి కమిటీ వేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎక్స్గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా ను ఉద్దేశించి పట్టణ సిపిఐ కార్యదర్శి సత్యనారాయణ రాజు సంఘీభావం ప్రకటించి కార్మికులకు ఇవ్వవలసిన బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలని వారి చేయి పోరాటాలకు, పార్టీ సంఘీభావంగా మద్దతుగా ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ యూనియన్ సెక్రటరీ చిరుగురి జక్రం మాట్లాడుతూ, కనీస వేతనం 36,000 ఇవ్వాలని, కార్మికులందరి కు కూడా ఐ.ఎస్.ఐ కార్డులు ఇవ్వాలని, కార్మికులందరికీ గ్రాట్యుటి అమలు చేయాలని కోరారు. సమస్యలు అధికారులు ప్రభుత్వం అమలు చేయని ఎడల ఈనెల 22వ తారీఖున స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, 24 వ తారీఖున చలో కలెక్టరేట్, అప్పటికి సమస్యలు పరిష్కారం కాని పక్షాన జులై 7 ఛలో విజయవాడ భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ దీనమ్మ, జాయింట్ సెక్రెటరీ డేవిడ్, వినుకొండ కొండమ్మ, దయామణి, కొండ్రు శీను, బోదాల యేసు, గల్లిపోగు శివ తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లు బంద్ సర్వర్ నిర్వహణ పనులు?

హైదరాబాద్, జూన్ 20, ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసే వారితో పాట రిజిస్ట్రేషన్ పనుల కోసం ఎదురుచూస్తున్న సాధారణ ప్రజలకు రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందించింది. శాఖకు సంబంధించిన ప్రధాన వెబ్‌సైట్‌తో పాటు దానికి అనుబంధంగా పనిచేసే అన్ని ఆన్‌లైన్ సేవలు ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని వెల్లడించింది. సర్వర్ల ఆధునీకీకరణ, షెడ్యూల్ చేసిన సాంకేతిక నిర్వహణ పనుల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.రిజిస్ట్రేషన్ల శాఖలో దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ స్థాయి సర్వర్ నిర్వహణ పనులను అధికారులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ సర్వర్ వ్యవస్థలు భవిష్యత్తులో మరింత సజావుగా, ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా పనిచేస్తాయి. అంతేకాకుండా వినియోగదారుల డేటా భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం?. ప్రజలకు అందించే సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం కోసం ఈ తాత్కాలిక సాంకేతిక విరామం తప్పనిసరి అయిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వివరించారు.ఈ మూడు రోజుల విరామం వల్ల ప్రజలకు పెద్దగా ఇబ్బందులు కలగకుండా అధికారులు ఈ షెడ్యూల్‌ను రూపొందించారు. జూన్ 26వ తేదీన మొహర్రం పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉంది. అలాగే జూన్ 28వ తేదీన ఆదివారం రావడం వల్ల ఆ రోజు కూడా ప్రభుత్వ అధికారిక సెలవు దినమే అవుతుంది. ఈ రెండు సెలవుల మధ్యలో ఉన్న జూన్ 27వ తేదీన ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పనిదినంగా ఉంటుంది. ఫలితంగా కేవలం ఒకే ఒక్క వర్కింగ్ డే రోజున మాత్రమే రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని వీలైనంత తగ్గించాలనే ఉద్దేశంతోనే ఈ మూడు రోజుల సమయాన్ని ఎంచుకున్నట్లు ఆయన చెప్పారు.ఈ నేపథ్యంలో భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలనుకునే ప్రజలు ఈ మూడు రోజుల విరామాన్ని గమనించాలని అధికారులు సూచించారు. తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను, స్లాట్ బుకింగ్స్‌ను ముందస్తుగానే ప్రణాళిక చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 29వ తేదీ సోమవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ఎప్పటిలాగే యథావిధిగా పునఃప్రారంభమవుతాయి. శాఖను సాంకేతికంగా మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న ఈ నిర్వహణ పనులకు ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు పూర్తిగా సహకరించాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు.

## మాజీ సైనికుడి భూమిని అక్రమించారు దగ్గుబాటి సురేష్ బాబుపై ఆరోపణ

హైదరాబాద్‌శేర్లింగంపల్లి,ఖానామెట్లోని తమ 5 ఎకరాల ప్రైమ్ ల్యాండ్ ని కబ్జా చేశారని దగ్గుబాటి సురేష్ బాబు, దగ్గుపాటి రామానాయుడు, దగ్గుపాటి వెంకటేష్,దగ్గుపాటి లక్ష్మీ,లక్ష్మి లపై బాధితులు ఆరోపణులే చేసారు. తమ భూమి హద్దులతో కలిసి ఉన్న 21 ఎకరాల స్థలంతో పాటు అపర్ణ కన్స్ట్రక్షన్ కంపెనీ తమ 5 ఎకరాల ప్రైమ్ ల్యాండ్ ను సదరు దగ్గుపాటి కుటుంబంతో కలిసి కబ్జా చేసింది అంటూ ఆరోపించారు.

ఖానామెట లో సర్వే నెంబర్ 49/1 లో 5 ఎకరాల భూమి ఉంది.. 1994 లో ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో షేక్ అహ్మద్ కు ఈ 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.. ఈ స్థలాన్ని దగ్గుబాటి సురేష్ బాబు కబ్జా చేశారు. పక్కనే ఉన్న తన 21 తన ఎకరాల స్థలంతో పాటు మా 5 ఎకరాల స్థలాన్ని కబ్జా పెట్టి.. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కి డెవలప్మెంట్ కి ఇచ్చారు. అడిగితే.. అపర్ణ కన్స్ట్రక్షన్ కంపెనీ సెక్యూరిటీ అని చెప్తున్నారు. మా స్థలంలోకి మమ్మల్ని రానివ్వడం లేదు. కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దు అయినా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు.

# ప్రైవేటు బస్సు సీజ్ ప్రయాణిలకు తిప్పలు

హైదరాబాద్ ఖైరతాబాద్ ఆర్టిఏ అధికారుల నిర్వాకం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు దారి తీసింది. శుక్రవారం రాత్రి రాత్రి హైదరాబాద్ నుండి రాజస్థాన్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆర్టిఏ అధికారులు సీజ్ చేసారు. సీజ్ చేసిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు వున్నారు. సీజ్ చేసిన బస్సుతోపాటు ప్రయాణికులను కూడా ఆర్టిఏ ఖైరతాబాద్కు తీసుకువచ్చారు. వారికి ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేయటంలో ఆర్టిఏ అధికారుల విఫలం అయ్యారు. రాత్రంతా సీజ్ చేసిన బస్సులోనే 50 మంది ప్రయాణికులు వుండిపోయారు. తినడానికి తిండి లేక, వాష్రూమ్స్ కి కూడా లేక తీవ్ర ఇబ్బంది పడి అవస్థలు ప్యాసింజర్లు ఎదురుకున్నారు. 10 గంటలుగా ఖైరతాబాద్ ఆర్టిఏ లోనే ట్రావెల్స్ బస్సు వుండిపోయింది. ప్రయాణికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

# స్త్రీ నిధి రికవరీ, రుణాల పంపిణీ 100 శాతం చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

## స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, జూన్-20,ప్రజాబలం ప్రతినిధి:**స్త్రీ నిధి రికవరీని 100 శాతానికి పెంచడంతో పాటు రుణాల పంపిణీని శత శాతం పూర్తి చేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశం లో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణ చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని రికవరీలు మన స్త్రీ నిధి యాప్ ద్వారానే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లావాదేవీలలో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్‌మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని





స్థాయిలలో యాప్ వినియోగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వివోఏ ల అంశంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని స్వయం సహాయక సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బందికి అన్ని స్థాయిలలో పూర్తి సహకారం అందించాలని, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జీవనోపాధి రుణాల మంజూరును పెంచడంతో పాటు జీరో రికవరీ సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని సూచించారు. జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో రికవరీ పనితీరు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మహిళల సుస్థిర జీవనోపాధుల అభివృద్ధికి స్త్రీ నిధి రుణాలను సమర్థవంతంగా వినియోగించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ కాళిందిని, ఏడిఆర్డిఓ రవీందర్ , స్త్రీ నిధి ఆర్ ఎం ఆర్.దుర్గా ప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యకురాలు స్వప్న కార్యదర్శి శోభా, కోశాధికారి స్వప్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు వివిధ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2న శ్రీ వెంకటేశ్వర మహామంత్ర ఆధ్వర్యంలో హరినామ క్షేత్రం.




ఖైరతాబాద్, జూన్ 20.  : జూలై 2న శ్రీ వెంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో సిద్దిపేట దగ్గరలో  చిన్న గుండవెల్లి గ్రామంలో తిరుమల శ్రీ వెంకటేశ్వరుని హరినామ క్షేత్రం నిర్మించినట్లు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కేవి రమణ చారి, గోవింద దాసు తెలిపారు. శనివారం రోజు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఏడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు,  ఉదయం 8 గంటల 46 నిమిషాలకు శ్రీశ్రీశ్రీ దేవనాథ్ జి ఆర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో మంగళ శాసనములతో తిరుమల వైఖానస శ్రీ వైష్ణవులచే శంకుస్థాపన చేయుట కు నిర్ణయించినట్లు తెలిపారు.

# భారీగా తగ్గిన  రిజిస్ట్రేషన్లు

కరీంనగర్, జూన్ 20, తెలంగాణ ప్రభుత్వం జూన్ 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన భూముల మార్కెట్ విలువల సవరణ ప్రభావం ద్వితీయ శ్రేణి నగరాలపై తీవ్రంగా పడింది. రాజధాని హైదరాబాద్ వెలుపల రియల్ ఎస్టేట్ రంగానికి ప్రధాన కేంద్రాలుగా ఉన్న ఖమ్మం, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రస్తుతం జనాలు లేక వెలవెలబోతున్నాయి. గతంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిన ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు.. ఈ ఆకస్మిక ఫీజుల పెంపుతో ఒక్కసారిగా చల్లబడ్డాయి. క్షేత్రస్థాయిలో పెరిగిన ధరల భారాన్ని భరించలేక అటు కొనుగోలుదారులు, ఇటు వెంచర్ల నిర్వాహకులు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉంటున్నారు.గత ఆరేడేళ్ల కాలంలో ఈ నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీ ఎత్తున ఊపందుకుంది. ప్రతి రోజూ వందలాది డాక్యుమెంట్లు, కొత్త వెంచర్ల రిజిస్ట్రేషన్లతో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల వర్షం కురిసేది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ విలువను ఒకేసారి భారీగా పెంచడంతో సీన్ పూర్తిగా రివర్స్ అయింది. రిజిస్ట్రేషన్ల శాతం మారకపోయినా.. భూమి ప్రాథమిక ప్రభుత్వ ధర ను పెంచేయడం వల్ల డాక్యుమెంట్‌కు చెల్లించాల్సిన అసలు రుసుము కొండెక్కి కూర్చుంది. దీనివల్ల మధ్యతరగతి ప్రజలు తమ సొంతింటి కలలను తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నారు.ఈ మార్కెట్ విలువ పెంపు ఏ స్థాయిలో ఉందో ఖమ్మం నగర పరిసరాల గణాంకాలను గమనిస్తే స్పష్టమవుతోంది. ఖమ్మం శివార్లలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న కొన్ని ప్రధాన లేఅవుట్లలో గతంలో ప్రభుత్వ గజం ధర రూ. 4,100 గా ఉండేది. కానీ కొత్త సవరణల ప్రకారం.. ఆ ధరను ఒకేసారి ఏకంగా రూ. 6,200 కు పెంచేశారు. గజానికి రూ. 2,100 పైగా పెరగడంతో, ఒక సాధారణ 200 గజాల ప్లాట్ కొనే సామాన్యుడు కూడా ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన 7.5 శాతం చొప్పున వేల రూపాయల అదనపు భారాన్ని భరించాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి వరంగల్, కరీంనగర్ స్మార్ట్ సిటీ పరిధిలోని ల్యాండ్ వాల్యూస్‌లోనూ కనిపిస్తోంది.ఈ రేట్ల పెంపు అమల్లోకి వచ్చిన మొదటి రోజే రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ. 73 కోట్ల నుండి రూ. 45 కోట్లకు పడిపోవడం రియల్ ఎస్టేట్ మందగమనానికి అద్దం పడుతోంది. ఖమ్మం, కరీంనగర్, వరంగల్ వంటి ప్రాంతాల్లో మార్కెట్ రేట్లకు, ప్రభుత్వ రేట్లకు మధ్య వ్యత్యాసం పెరిగిపోవడంతో చాలా చోట్ల ట్రేడింగ్ నిలిచిపోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నగరాల పరిధిలో పెంచిన గైడెన్స్ రేట్లను పునఃసమీక్షించాలని లేదా రియల్ ఎస్టేట్ అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నట్లు రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించాలని స్థానిక బిల్డర్లు కోరుతున్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారం తగ్గించాలి: బీజేపీ

## ఫీజుల నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యంపై బీజేపీ నిరసన



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 20:**ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నిరసిస్తూ, ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీ మర్నేని ఫనీంద్ర నాయకత్వంలో 21-06-2026 నాడు ఉప్పల్ మెయిన్ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న “నిరసన దీక్ష”కు నా సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నాను అని బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నప్పటికీ, ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమంలో తాడూరి శ్రీనివాస్ పాల్గొని, ప్రజల గళాన్ని ప్రభుత్వానికి వినిపించనున్నాను.

బీజేపీ శ్రేయోభిలాషులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాను అని తెలిపారు.

# రాజీవ్ రహదారి అభివృద్ధి పనులు వేగవంతం



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 20:**సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట్ వరకు చేపడుతున్న రాజీవ్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా తూంకుంట ప్రాంతంలో భూసేకరణకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది.

గతంలోనే భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందజేయగా, వారి అభ్యర్థన మేరకు మూడు నెలల గడువు కూడా కల్పించబడింది. అనంతరం ఎస్‌డీసీఎల్ అధికారులు సేకరించిన భూమిని పంచనామా నిర్వహించి, జూన్ 6వ తేదీన హెచ్ఎండీఏ అధికారులకు అధికారికంగా అప్పగించారు.

ఈ నేపథ్యంలో శనివారం ఎస్‌డీసీఎల్ మాలతి ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ అధికారులు స్థలంలో ఉన్న నిర్మాణాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. రహదారి విస్తరణ పనులు నిర్దేశిత ప్రణాళిక ప్రకారం కొనసాగేందుకు అవసరమైన చర్యలను అధికారులు తీసుకుంటున్నారు.

ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ సర్వేయర్ వినయ్ కుమార్, ఆర్ఐ రాఘవ, హెచ్ఎండీఏ ఏఈ సంపత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాదు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సమగ్ర జీవన విధానం.. బేరి రామచందర్ యాదవ్

## - 12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొన్న యోగ గురువు నూనె సురేందర్, గారేలా వెంకటేష్ గురూజీ, బేరి రామచందర్ యాదవ్..



**శేర్లింగంపల్లి ప్రజాబలం ప్రతినిధి నరేష్ జూన్ 20**సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ 12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొన్న యోగ గురువు నూనె సురేందర్, గారేలా వెంకటేష్ గురూజీ, బేరి రామచందర్ యాదవ్. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుల్ మోర్ పార్క్ నేతాజీ నగర్ లో ఉచిత పతాంజలి యోగ శిబిరంను అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ 12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొన్న నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూయోగా అనేది కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించేందుకు ఐక్యరాజ్యసమితి (యుఎన్ఓ) 2015 సంవత్సరం నుండి ప్రతి ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సంవత్సరం యోగా దినోత్సవం యొక్క ప్రధాన అంశం ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా” (యోగా ఫర్ హెల్తీ ఏజింగ్) అని వివరించారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక, భావోద్వేగ మరియు సామాజిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. యోగాలో ప్రధానంగా యోగాసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానం అనే మూడు ముఖ్యమైన అంశాలు ఉంటాయని వివరించారు. క్రమబద్ధమైన యోగా సాధన వల్ల కండరాలు బలపడటం, రక్తప్రసరణ మెరుగుపడటం, శరీర సౌష్టవం పెరగటం, అలసట తగ్గటం, శక్తి స్థాయిలు పెరగటం, జీవక్రియ మెరుగుపడటం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. అదేవిధంగా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి మానసిక సమస్యలను అధిగమించడంలో కూడా యోగా సమర్థవంతంగా సహాయపడుతుందని చెప్పారు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా సాధనతో పాటు సమతుల ఆహారం, తగినంత నీటి సేవనం, శారీరక చలనం, సరైన విశ్రాంతి మరియు సానుకూల ఆలోచనలు అవసరమని సూచించారు. ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యోగ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించిన మహర్షి పతంజలి సేవలను స్మరించుకుంటూ, యోగా ద్వారా వ్యక్తి శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక వికాసాన్ని సాధించగలడని పేర్కొన్నారు. “వ్యాధి లేని శరీరం -- వేదన లేని మనస్సు” అనే లక్ష్యాన్ని సాధించడానికి యోగా ఒక అద్భుతమైన మార్గమని వివరించారు. అలాగే నేటి వేగవంతమైన, ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ కుల, మత, ప్రాంత, లింగ భేదాలకు అతీతంగా యోగా సాధనను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. “యోగం ఆరోగ్యానికి మార్గం -- ఆరోగ్యమే ఆనందమయ జీవితానికి పునాది” అనే సందేశంతో కార్యక్రమం యోగా శిక్షకులు సాయి ప్రియ, సాయినాథ్, ఉదయ్ కుమారి, లక్ష్మీ మాత, రాధా, గీత, ప్రసన్న, కృష్ణారెడ్డి, నాగరాజు, గజేందర్, హరి, చందు గోపి, శ్రీశైలం, ప్రసాద్, గుల్మో మోర్  పార్క్ నేతాజీ నగర్ యోగా సభ్యులు పెద్ద ఎత్తున సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ కి తరలి వెళ్లి అంతర్జాతీయ యోగ దినోత్సవం కార్యక్రమం పాల్గొని విజయవంతం చేసిన వారందరికీ బేరి రామచందర్ యాదవ్ ధన్యవాదములు తెలిపినారు.

# చదువుతోనే సమాజ అభివృద్ధి

## – చెడు వ్యాసనాలకు విద్యార్థులలు దూరంగా ఉండాలి : ఏసిపి ఎం.రమేష్



**పెద్దపెల్లి/గోదావరిఖని, జూన్ 20, ప్రజాబలం ప్రతినిధి** :చదువుతోనే సమాజం అభివృద్ధి అవుతుందని, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఏసీబీ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక శారద నగర్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నశ ముక్తి భారత్ అభియాన్– నశ ముక్తి బారత్ సప్తః అధ్వర్యములో మద్యపానం మరియు మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసిపి రమేష్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజాభివృద్ది కి పాటు పడాలని తెలిపారు. మాధక ద్రవ్యాల నిర్మూలన విద్యార్థుల చేతుల్లో ఉందనీ,మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసలు అయిన వారి కోసం చికిత్స సెంటర్ లలో డి––అడిక్షన్ గురించి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కల్పనా, సిబ్బంది, ప్రకృతి పర్యావరణ సంస్థ ఎన్జీఓ డి-అడిక్షన్ సెంటర్ ఇంచార్జ్, ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## మర్పల్లి మండలసర్పంచ్ ల సంఘం జనరల్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన పట్నం భాగ్య అశోక్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 20 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం శుక్రవారం జరిగిన మర్పల్లి మండల సర్పంచ్ల ఫోరం సమావేశంలో ఏకగ్రీవంగా మల్లికార్జునగిరి సర్పంచ్ పట్నం భాగ్య అశోక్ ఎన్నిక కావడం పట్ల సంతోషం వ్యక్తపరిచారు గ్రామానికి గ్రామ ప్రజలకు సేవ చేసే భాగ్యం ఇచ్చినందుకు అదృష్టంగా భావిస్తున్నాం ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళలా మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆశీర్వదిస్తే మల్లికార్జునగిరి గ్రామాన్ని మండల ఆదర్శ గ్రామంగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మల్లికార్జునగిరి సర్పంచ్ పట్నం భాగ్య అశోక్ తెలిపారు

## జాతీయ లోక్ అదాలత్ లో 161 కేసుల పరిష్కారం



**జహీరాబాద్, జూన్ 20 ప్రజాబలం ప్రతినిధి:** జాతీయ లోక్ అదాలత్ లో 161 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారం అయినట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జ్ జి. కవితా దేవి తెలిపారు. జహీరాబాద్ కోర్ట్ లో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో సివిల్, క్రిమినల్, బ్యాంకు, సైబర్ క్రైమ్ తదితర కేసులు పరిష్కారమైనట్లు వెల్లడించారు. సీనియర్, ప్రిన్సిపల్ జూనియర్, అదనపు కోర్టు విభాగాల్లో 161 కేసులు పరిష్కారం కాగా రూ.85, 09,484 వసూలు అయినట్లు పేర్కొన్నారు.

# వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ ...జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.శ్రీధర్

**పెద్దపల్లి, జూన్ –20, ప్రజాబలం ప్రతినిధి:** జూన్ 24న పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. వైద్య పోస్టుల కొరకు ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.బి.బి.ఎస్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ వేతనం రూ" 52,351 ఉంటుందని , ఇతర వివరాలకు 9492457809, 8499061999 నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ పేర్కొన్నారు.

# అన్నదాతలను అనాధలుగా మార్చే దుర్మార్గాపు పాలన...

## అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు,రైతుల సమస్యలు,భూముల అంశం,వ్యవసాయ రంగ పరిస్థితులు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలపై విస్తృతంగా మాట్లాడారు,క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రులు రైతుల నడ్డి విరిచే రకంగా అధ్యాయాన్ని నింపే విధంగా వారి రైతులకు ద్రోహం చేసేలా మాట్లాడుతున్నారని అన్నారు,అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాధలుగా మార్చే దుర్మార్గానికి కాంగ్రెస్ పార్టీ దిగజారిందని విమర్శించారు,కేంద్రం చెప్పిన కోట వరకు మాత్రమే పంటలు కొంటామని, రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనంగా ఒక్క గింజ కూడా కొనబోమని చెప్పడం రైతులకు మరణశాసనం లాంటిదన్నారు. వ్యవసాయాన్ని ఇప్పటికే సంక్షోభంలోకి నెట్టి రైతు బతుకును ఛిన్నాభిన్నం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపించారు,పదేళ్లపాటు ధైర్యంగా బతికిన రైతును మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి కష్టాల్లోకి నెట్టారని విమర్శించారు,తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధువుగా రైతు కష్టాలు తెలిసిన నాయకుడిగా రాష్ట్రంలో అన్నదాతలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా దేశానికే ఆదర్శంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు,రాష్ట్రంలో పది సంవత్సరాలు స్వర్ణయుగంలా కేసీఆర్ పాలన సాగిందన్నారు. దశాబ్దాల చరిత్రలో ఏ పాలకుడు ఆలోచించని విధంగా రైతుబంధు పేరుతో పెట్టుబడి సహాయాన్ని ప్రవేశపెట్టి 11 విడతల్లో రూ.72 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసి దేశంలో చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు,రైతు కుటుంబానికి ఏమైనా జరిగితే రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో రూ.5 లక్షల రైతు బీమా అమలు చేశామని చెప్పారు. రైతుబంధుకు రూ.72 వేల కోట్లు, రైతు రుణమాఫీకి రూ.29 వేల కోట్లు, రైతు బీమాకు రూ.6,800 కోట్లు ఖర్చు చేసి రైతుల ఖాతాల్లో లక్ష కోట్లకు పైగా నేరుగా జమ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు,స్వతంత్ర భారతదేశంలో తొలిసారిగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి చరిత్ర సృష్టించామని తెలిపారు. రైతు కేంద్రబిందువుగా సాగిన పాలన వల్ల తెలంగాణలో వ్యవసాయ విప్లవం వచ్చిందని, నెర్రెలు బారిన నేలలు పచ్చని మాగాణాలుగా మారాయని అన్నారు,2014కు ముందు వానాకాలం, యాసంగి కలిపి కోటి 31 లక్షల ఎకరాల పంట విస్తీర్ణం ఉండగా, 2023 నాటికి అది 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. అన్ని రకాల పంటల ఉత్పత్తితో తెలంగాణ దేశానికే ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారిందన్నారు,కరోనా కష్టకాలంలో 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు కల్లాల వద్దే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుకు అండగా నిలిచారని చెప్పారు. మద్దతు ధరకు కేవలం వరిధాన్యమే కాకుండా మొక్కజొన్న, జొన్న, శనగ, కందులు, పెసలు, సన్ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను కూడా కొనుగోలు చేశామని గుర్తు చేశారు,రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు,రాష్ట్రంలోని ప్రజల పక్షాన, రైతుల పక్షాన వారికి అండగా ఉంటూ బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మళ్లీ కేసీఆర్ రావాలి, కేసీఆర్ వస్తేనే మా బతుకులు బాగుంటాయని ప్రజలు భావిస్తున్నారని అన్నారు,కేసీఆర్ పాలనలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపడమే చేస్తున్నారని ఆరోపించారు,నియోజకవర్గంలో పది సంవత్సరాల పాటు భూములను కాపాడామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు,ఈ అంశంపై సంబంధిత మంత్రులను, జిల్లా కలెక్టర్ను కలిసి రైతుల భూములు కాపాడాలని, వారికి రావాల్సిన పరిహారం ఇవ్వాలని, అన్యాయంగా భూములు తీసుకోవద్దని కోరామని చెప్పారు. రైతులను భయపెట్టి “మీకు ఒక్క రూపాయి రాదు” అని బలవంతంగా భూములు తీసుకుంటున్నారని ఆరోపించారు,గతంలో ఓడిపోయినా వందల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని, ఆ నిధులను కూడా రద్దు చేశారని అన్నారు. కొత్తగా నిధులు తీసుకురాకుండా ప్రచారమే చేస్తున్నారని విమర్శించారు,అక్రమాలు ఎక్కడ జరిగినా ఊరుకోమని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, పేద ప్రజలను భయపెట్టి భూములు తీసుకోవడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు,ఈ మీడియా సమావేశంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, నాయకులు శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ నాయక్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ లో అవినీతి సొమ్ముతో కొంటున్న ఆనకొండలు

హైదరాబాద్, జూన్ 20, దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్, ముఖ్యంగా లగ్జరీ హౌసింగ్ విభాగం ప్రస్తుతం విస్మయపరిచే స్థాయి ధరలతో దూసుకుపోతోంది. గచ్చిబౌలి, మాధాపూర్, కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో రూ. 10 కోట్ల నుండి రూ. 50 కోట్ల విలువైన విల్లాలు, సూపర్ లగ్జరీ అపార్ట్మెంట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే, ఈ అసాధారణ వృద్ధి వెనుక అసలు కొనుగోలుదారులు ఎవరు? అంత మొత్తం ఎక్కడి నుండి వస్తోంది? అనే అంశంపై ఆర్థిక, రాజకీయ వర్గాల్లో ఒక లోతైన చర్చ నడుస్తోంది. ఈ మార్కెట్ను నడిపిస్తున్నది కేవలం ప్రవాస భారతీయులు , నిజాయితీ గల వ్యాపారవేత్తలు మాత్రమే కాదని.. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి సొమ్ము నిక్షిప్తమై ఉందని ఇటీవల ఏసీబీ దాడుల్లో దొరుకుతున్న ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నాయి.పక్కా బిజినెస్ మైండ్ ఉన్న ఏ నిజమైన వ్యాపారవేత్త కూడా యాభై కోట్ల రూపాయల భారీ నగదును తెచ్చి ఒకే ఒక లగ్జరీ ఇల్లు లేదా అపార్ట్మెంట్పై గుడ్డిగా పెట్టుబడి పెట్టడు. ఎందుకంటే, అంత పెద్ద మొత్తాన్ని తమ సొంత వ్యాపారాల్లోనో, స్టార్టప్లలోనో లేదా గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లలోనో మళ్లిస్తే వచ్చే రాబడి చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. వ్యాపారులు తమ నివాసం కోసం ఒక సారే లగ్జరీ ఇల్లు కొంటారు కానీ.. కేవలం నెలకు కొన్ని లక్షల రూపాయల అద్దె కోసం రూ. 20 కోట్ల నుండి రూ. 50 కోట్లు బ్లాక్ చేయరు. లగ్జరీ నివాస రంగంలో వార్షిక అద్దె రాబడి కేవలం 2 నుండి 3 శాతానికి మించి ఉండదు. ఇంత తక్కువ రాబడికి ఆశపడి ఏ అచ్చమైన వ్యాపారీ కోట్ల కొద్దీ సత్సంపాదనను ఇక్కడ స్తంభింపజేయడు.హైదరాబాద్ లగ్జరీ రియల్ మార్కెట్లో ఊహాజనితంగా పెరుగుతున్న ధరలకు ప్రధాన కారణం అవినీతి సొమ్ము , లెక్కల్లోకి రాని బ్లాక్ మనీ . పన్నుల పరిధిలోకి రాని నల్లధనాన్ని, అవినీతి ద్వారా ఆర్జించిన సొమ్మును సురక్షితంగా దాచుకోవడానికి బడా బాబులు, కొందరు రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లు రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక సేఫ్ హెవెన్ లా వాడుకుంటున్నారు. బినామీల పేరిట, వివిధ అక్రమ మార్గాల ద్వారా ఈ నిధులు లగ్జరీ ప్రాజెక్టుల్లోకి ప్రవహిస్తున్నాయి. ఈ తరహా కృత్రిమ డిమాండ్ ల్లే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ ఈ అవినీతి సొమ్ము ప్రవాహం గనుక ఆగిపోతే.. రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక్కసారిగా స్థిరపడి పూర్తిగా క్లీన్ అయ్యే అవకాశం ఉంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ ఐటీ కారిడార్ చుట్టుపక్కల రూ. 10 కోట్లకు పైబడి జరుగుతున్న ప్రతి లగ్జరీ రియల్ ఎస్టేట్ లావాదేవీని, కొనుగోలుదారుల పూర్తి వివరాలను దర్యాప్తు సంస్థలు సేకరించి క్రాస్–వెరిఫై చేయాలి. సదరు కొనుగోలుదారుల అధికారిక వార్షిక ఆదాయం ఎంత? వారు చెల్లిస్తున్న పన్నులకు, కొనుగోలు చేసిన ఆస్తి విలువకు పొంతన ఉందా? లేదా? అని క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తే అసలు నిజాలు, బినామీల గుట్టు రట్టవుతాయి. పారదర్శకమైన ఇటువంటి ఆడిటింగ్ వ్యవస్థను తీసుకువచ్చినప్పుడే, హైదరాబాద్ రియల్ రంగానికి పట్టిన అవినీతి చీడ వదిలి.. మార్కెట్ నిజమైన కొనుగోలుదారులకు అందుబాటులోకి వస్తుంది

## ప్రజల చేతిలో ప్రజాస్వామ్య పాశుపతాస్త్రం - సమాచార హక్కు చట్టం

### (సి.హెచ్. ప్రతాప్)

భారత ప్రజాస్వామ్య చరిత్రలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ఒక విప్లవాత్మక సంస్కరణగా గుర్తింపు పొందింది. 2005లో అమల్లోకి వచ్చిన ఈ చట్టం రెండు దశాబ్దాలకు పైగా ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థలను చేరువ చేస్తూ, పారదర్శకతను మరియు జవాబుదారీతనాన్ని బలోపేతం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు, ఖర్చులు, ఒప్పందాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సాధారణ పౌరుడికి ప్రశ్నించే హక్కును కల్పించింది.
ఆర్‌టీఐ ద్వారా అనేక అవినీతి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ప్రజా నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పురోగతి వంటి విషయాల్లో సమాచారాన్ని పొందే అవకాశం ప్రజలకు లభించింది. ఎన్నికల బాండ్ల వంటి రాజకీయ నిధుల వ్యవస్థలపై కూడా పారదర్శకత కోసం ఈ చట్టం కీలక పాత్ర పోషించింది. ప్రజాస్వామ్యంలో సమాచారం అందుబాటులో ఉండటం ఎంత అవసరమో ఆర్‌టీఐ నిరూపించింది.

అయితే ఈ వ్యవస్థ ఇంకా పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా సమాచార కమిషన్లలో లక్షలాది అప్పీలు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరం. ప్రతి సంవత్సరం కొత్త కేసులు పెరుగుతుండటంతో, సమాచారం కోరిన పౌరులు నెలల తరబడి, కొన్నిసార్లు సంవత్సరాలపాటు ఎదురుచూడాల్సి వస్తోంది. దీంతో చట్టం ఉద్దేశించిన వేగవంతమైన సమాచార హక్కు దెబ్బతింటోంది.

కొంతమంది వ్యక్తులు ఆర్‌టీఐని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించే సందర్భాలు ఉన్నప్పటికీ, దాని ఆధారంగా మొత్తం వ్యవస్థను అనుమానించడం సమంజసం కాదు. ప్రజా నిధులతో జరిగే పనులపై సమాచారం కోరడం ప్రతి పౌరుడి హక్కు. సమాచారం కోరే వారి ఉద్దేశాలపై అనవసర సందేహాలు వ్యక్తం చేయడం నిజాయితీగా ప్రశ్నించే పౌరులను నిరుత్సాహపరచవచ్చు.

ఆర్‌టీఐ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయడం, పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించడం, సమాచారం నిరాకరించే అధికారులపై చర్యలు తీసుకోవడం అవసరం. అలాగే అధికారులకు శిక్షణ ఇవ్వడం, సమాచార హక్కు కార్యకర్తలు మరియు విజిల్‌బ్లోయర్లకు రక్షణ కల్పించడం కూడా ముఖ్యం.

## బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ సమన్వయంతో పూర్తి చేయాలి :అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 20** ములుగు శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి తన ఛాంబర్‌లో బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

మిల్లింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, మిల్లర్లు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం మెరుగ్గా ఉంటే ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్, డి యం కృష్ణ వేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి -మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి



**జహీరాబాద్, జూన్ 20 ప్రజాబలం ప్రతినిధి:** మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. వివేకానంద ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కోల్ ఇండియా లిమిటెడ్ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న మహిళ స్వశక్తికరణ నైపుణ్యభివృద్ధి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాల్కల్ మండలంలోని మెటల్ కుంట, కోహిర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి, కవేలి, జహీరాబాద్ మండలంలోని డిడ్గి,



మొగుడంపల్లి మండలంలోని ధనసిరి, వేమారెడ్డి నగర్ గ్రామాలకు చెందిన మహిళలకు వివిధ ఉపాధి ఆధారిత రంగాల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని వికాస్ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో 12 బ్యాచులు నిర్వహించబడతాయన్నారు. బ్యాచ్కు రెండు నెలల పాటు శిక్షణ అందించి సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. కూల్ ఇండియా వారి సహకారంతో గ్రామీణ ప్రాంత మహిళలకు నాణ్యమైన శిక్షణ అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. భవిష్యత్తులో సంస్థ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా శిక్షణను అందించడం పట్ల గ్రామీణ మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మహిళలు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్పీజీ వినియోగదారులు జూన్ 30 లోగా తప్పనిసరిగా ఈ కేవైసీ పూర్తి చేయాలి

### జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 20** ములుగుములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎల్పీజీ వినియోగదారులందరూ తమకు సంబంధించిన ఇ-కేవైసీ ప్రక్రియను ఈ నెల జూన్ 30, 2026 లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్పీజీ వినియోగదారులు ఎవరైతే ఇప్పటివరకు తమ ఈ కేవైసీ పూర్తి చేయలేదో, వారు నేరుగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి వెంటనే ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాప్ డీలర్లు వినియోగదారులకు పూర్తి సహకారం అందించి ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.

నిర్దేశిత గడువులోగా ఈ కేవైసీ పూర్తి చేయని వినియోగదారులు ఎల్పీజీ సబ్సిడీకి సంబంధించిన బకాయిలు, ఇతర ప్రయోజనాలు కోల్పోయే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి వినియోగదారుడు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## ప్రణామ్ డే కేర్ సెంటర్లోని వయోవృద్ధులకు హెల్త్ క్యాంప్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 20 ములుగు** ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు ఆదేశాల మేరకు, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత సూచనలతో ములుగు జిల్లా కేంద్రంలోని ప్రణామ్ డే కేర్ సెంటర్ నందు వయోవృద్ధులకు డెంటల్ హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.

ప్రత్యేక వైద్య బృందం జిల్లా హాస్పిటల్ డాక్టర్ వీరమల్లు హరీష్, నర్సింగ్ ఆఫీసర్ జి. తిరుపతి --- డే కేర్ సెంటర్ లోని వయోవృద్ధులకు డెంటల్ చెకప్ నిర్వహించారు

. ఈ క్యాంపులో వయోవృద్ధులకు బిపి, షుగర్ టెస్టులు చేసి, సెంటర్లోని సభ్యులందరికీ డెంటల్ టెస్టులు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ములుగు డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సి ఎస్ ఆర్ఎంవో డాక్టర్ ఏ. అప్పయ్య మాట్లాడుతూ వయోవృద్ధులందరూ ప్రతిరోజూ ఉదయం, రాత్రి బ్రష్ చేయడం అలవాటు చేసుకోవాలని, చక్కెర పదార్థాలు, గుట్కా, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా బీపీ, షుగర్ చెక్ చేసుకోవాలని, చిన్న సమస్య ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. డే కేర్ సెంటర్ సభ్యులందరూ పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ క్యాంపులో సుమారు 30 మంది వయోవృద్ధులు డెంటల్ చెకప్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సహాయకులు నాగేంద్ర, ప్రాణమ్ డే కేర్ సెంటర్ సూపరిండెంట్ చుంచు రమేష్, డే కేర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ములుగు డివిజనల్ ఇంజనీర్‌గా సేవలందించిన నాగేశ్వరరావుక బదిలీ అదనపు బాధ్యతలు స్వీకరించిన కె. రాజు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 20 ములుగు** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించడంలో విశేష కృషి చేసిన నాగేశ్వరరావుములుగు డివిజనల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన పి. నాగేశ్వరరావు కార్పొరేట్ కార్యాలయం, హనుమకొండకు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.

ఆయన స్థానంలో ప్రస్తుతం ములుగు సర్కిల్ డీఈ (టెక్నికల్)గా ఉన్న శ్రీ కె. రాజు అదనపు బాధ్యతలను స్వీకరించారు.

పి. నాగేశ్వరరావు ములుగు డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేసిన కాలంలో వినియోగదారులకు మెరుగైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించేందుకు విశేషంగా కృషి చేశారు.

విద్యుత్ సరఫరా వ్యవస్థ బలోపేతం చేయడం, వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ఫిర్యాదులపై తక్షణ స్పందన చూపించడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.

తన విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, బాధ్యతాయుతమైన సేవలతో ప్రజల మన్ననలు పొందిన పి. నాగేశ్వరరావు భవిష్యత్ సేవా ప్రయాణం విజయవంతంగా కొనసాగాలని అధికారులు ఆకాంక్షించారు.అదనపు బాధ్యతలు స్వీకరించిన కె.రాజు నాయకత్వంలో ములుగు డివిజన్ పరిధిలో విద్యుత్ సేవలు మరింత మెరుగుపడి, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

**జహీరాబాద్, జూన్ 20 ప్రజా బలం ప్రతినిధి:** మిషన్ భగీరథ పైప్ లైన్ అత్యవసర మరమ్మత్తుల నేపథ్యంలో రెండు రోజులపాటు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈ ఈ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ పరిధిలోని భూసారెడ్డిపల్లి ఫిల్టర్ బెడ్ నుండి బుదేరా వరకు ఉన్న ప్రధాన పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తుల నేపథ్యంలో ఈనెల 21,22వ తేదీల్లో రెండు రోజులపాటు జహీరాబాద్ మున్సిపాలిటీ తో పాటు జహీరాబాద్, జరా సంఘం, కోహిర్ ,మొగుడంపల్లి మండలాల్లో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

### ఆత్మహత్య చేసుకున్న రైతు పండురంగ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

ఆదిలాబాద్ సిరికొండ మండలం పొన్న గ్రామంలో జొన్న పంట అమ్ముకోలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి పరామర్శించడానికి వెళ్తూ నేరడిగొండ చేరుకున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు నేరడిగొండ టూల్ ప్లాజా వద్ద బీఆర్ఎస్ నేతలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.
తరువాత అయన సిరికొండ మండలం పొన్న గ్రామానికి చేరుకున్నారు.

# గోమాతగా కొలిచే గోవులకు నీడ కరువు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 20**ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలలో గోవులకు రక్షణ కరువై పోయింది

హిందూ సాంప్రదాయ ప్రకారం గోవులను గోమాతగా పిలుస్తూ కొలుస్తూ ఎంతో భక్తి శ్రద్దలతో గోవులను పూజిస్తున్న తరుణంలో ఏటూరు నాగారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గోశాలలో ఆవులు విశ్రాంతి తీసుకోవడానికి నీడనిచ్చే షెడ్డు లేకపోవడంతో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గోవులు తడిసి వణికిపోయాయి చెట్ల కిందనే వర్షానికి పడిన నీటి బురదలో కాలం గడిపాయి ఆవులకు వేసే గడ్డి తడిసి మెత్తబడిపోవడంతో గోవులు గడ్డి మెయ్యలేని పరిస్థితి కనబడుతుంది తక్షణమే గోవులకు వర్షానికి తడవకుండా ఉండడానికి షెడ్ ఏర్పాటు చేసి ఆవులకు సంబంధించిన గడ్డి నిల్వ చేయడానికి గిడ్డంగి ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామపంచాయతీ సర్పంచ్ గారిని అధికారులను ఏటూరు నాగారం గ్రామస్తులు కోరుతున్నారు

# బడిబాట కార్యక్రమంలో పాఠశాలలను ఆస్పత్రిలోని తనిఖీ చేసిన పీఓ ఐటీడీఏ ఏటూరునగరం శ్రీ లెనిన్ వత్సల్ టోప్పో, ఐఏఎస్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 20** మంగపేట శనివారం మశీగపేట మండలం, బ్రహ్మణపల్లి మరియు చుంచుపల్లిలోని ఆశ్రమ్ హైస్కూల్ బాలుర ఒ బాలికల పాఠశాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటీడీఏ ఏటూరునగరం శ్రీ లెనిన్ వత్సల్ టోప్పో, ఐఏఎస్ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాలలు, టాయిలెట్ బ్లాక్‌లను తనిఖీ చేసి, అవసరమైన వస్తువులను ఏర్పాటు చేయాలని, ప్రాంగణం లోపల మరియు బయట శుభ్రపరిచే పనులు చేపట్టాలని ఇద్దరు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.



ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయులతో మాట్లాడి, ఆర్ఓ వాటర్ ప్లాంట్ల పనితీరు, టాయిలెట్లకు నీటి సరఫరా ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. గ్రామాలు/నివాస ప్రాంతాలలో పర్యటించేటప్పుడు బడిబాట కార్యక్రమం కింద విద్యార్థులను సమీకరించి, విద్యార్థుల సంఖ్యను పెంచాలని అందరినీ ఆదేశించారు.

వంటగది షెడ్లలో ఆహార వంటను తనిఖీ చేసి, మెనూ ప్రకారం వంట చేస్తున్నారో లేదో ధృవీకరించాము మరియు వంటగది పరిసరాలలో పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని వార్డెన్లను ఆదేశించారు.

తదనంతరం, బ్రహ్మణపల్లి మరియు చుంచుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి, సిబ్బంది హాజరు రిజిస్టర్లను ధృవీకరించారు మరియు సిబ్బంది అందరూ విధులకు హాజరవుతున్నారా లేదా అని విచారించారు మరియు గైర్హాజరైన సిబ్బంది నుండి వివరణలు కోరాలని ఐటీడీఏ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిని ఆదేశించారు.

ఇన్‌పేషెంట్ వార్డులు, డిస్పెన్సరీలు, మందుల నిల్వ మరియు ల్యాబ్‌లను తనిఖీ చేసి, పడకల లభ్యత, ల్యాబ్‌లో పరీక్షల కోసం మందులు, రియేజెంట్లు, పరీక్షల రకాలు, మందుల గడువు తేదీని సరిగ్గా తనిఖీ చేయడం మొదలైన వాటిపై విచారించారు.

ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలని, నిర్ణీత సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని మరియు వారానికి ఒకసారి గ్రామాలు మరియు గిరిజన సంక్షేమ విద్యా సంస్థలలో శిబిరాలను నిర్వహించాలని వైద్య అధికారులు మరియు సిబ్బందిని ఆదేశించారు.

# త్వరలో సంగారెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి...

## కింది బజార్ చెరువు కట్ట సుందరీకరణ పనుల కోసం పరిశీలించిన జగ్గారెడ్డి,నిర్మల
## ఎచ్ఎండిఏ ,ఫైనాన్స్,రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష
## రూ.500 కోట్లతో చెరువు ను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దేలా ప్రణాళికలు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/రోజు రోజుకి అభివృద్ధి దిశగా పరుగుపెడుతోంది సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ చెరువును రూ.500 కోట్లతో అభివృద్ధి చేసే దిశగా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి వేగం పెంచారు,సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు,అన్ని హంగులతో కింది బజార్ చెరువును సుందరీకరణ చేసేలా చేపట్టాల్సిన పనుల గురించి ఈ సందర్భంగా చర్చించారు,కిలో మీటరున్నర పొడవున ఉన్న చెరువు కట్టను అభివృద్ధి చేయడంతో పాటు,నెక్లెస్ రోడ్,పార్కులు ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు,సంగారెడ్డి పరిసర ప్రాంత ప్రజలతోపాటు, హైదరాబాద్ నుంచి





వచ్చే వారికి ఆహ్లాదం పంచేలా కింది బజార్ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అలాగే సంగారెడ్డిని తెలంగాణకు రోల్ మోడల్ గా చెయ్యాలని జగ్గారెడ్డి అధికారులకు సూచించారు,

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన!

త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కింది బజార్ చెరువు కట్ట పనులకు శంకుస్థాపన చేసేలా పనుల్లో వేగం పెంచాలని,అవసరమైన అన్ని ప్రతిపాదనలు పూర్తి చేయాలని జగ్గారెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ ప్రాంతాన్ని అందుబాటులోకి తేవాలన్నారు,టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మల, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కింది బజార్ చెరువు కట్ట వద్దకు వెళ్లారు. అలుగు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు,ఎక్కడెక్కడ ఏమేం పనులు చేయాలనే అంశమై ఈ సందర్భంగా జగ్గారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

# జూన్ 21,22 తేదీలలో మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**మునిపల్లి/మిషన్ భగీరథ పరిధిలోని బూసారెడ్డిపల్లి ఫిల్టర్ బెడ్ నుండి బుదేరా వరకు ఉన్న 1200 మి.మీ. ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడిన కారణంగా అత్యవసర మరమ్మత్తు పనులు చేపడుతున్నారని,మరమ్మత్తు పనుల నేపథ్యంలో జూన్ 21 (ఆదివారం) మరియు జూన్ 22 (సోమవారం)తేదీలలో క్రింది మున్సిపాలిటీలు మరియు మండలాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుందని మిషన్ భగీరథ ఈ.ఈ. విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు,

నీటి సరఫరా నిలిచిపోయే ప్రాంతాలు:

మునిపల్లి,కోహీర్, ఝరాసంగం,జహీరాబాద్,మొగుడంపల్లి,సంగారెడ్డి,కంది,సదాశివపేట,కొండాపూర్,తెల్లాపూర్,అమీన్‌పూర్,ఇంద్రేశం,పటాన్‌చెరు మున్సిపాలిటీలు మరియు మండలాలకు నీటి సరఫరా నిలిచి పోతుందని తెలిపారు,ఆయా ప్రాంతాల ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆమె కోరారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి టీవైజేఎఫ్ మరో ముందడుగు






**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 20 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామంలో టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్ రావు ఆదేశానుసారంతెలంగాణ యూత్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీవైజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీవైజేఎఫ్ సభ్యులకు ఐడీ కార్డులు, హెల్త్ కార్డులు, అలాగే జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీవైజేఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ను నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీవైజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఇబ్రాహీం, అబ్దుల్ జబ్బార్, సంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు జలీల్ రుస్తుం, ఉదయ్ పాటిల్, హెచ్. రాజు, నారాయణఖేడ్ కార్యదర్శి రెడ్డి వినోద్, నారాయణఖేడ్ ప్రధాన కార్యదర్శి షేక్ జలీల్, కంగ్టి మండల అధ్యక్షుడు ఎన్. ప్రకాష్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, కంగ్టి మండల ప్రధాన కార్యదర్శి మజరుద్దీన్, నారాయణఖేడ్ ఉపాధ్యక్షుడు అబ్దుల్లా ఉస్మాన్తో పాటు కంగ్టి మండల టీవైజేఎఫ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే టీవైజేఎఫ్ ప్రధాన ధ్యేయమని, సభ్యుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు, పిల్లల విద్యాభివృద్ధి కోసం ఉచిత విద్యా సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.కార్యక్రమంవిజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు....

# దళితుల అసైన్డ్ భూములు జోలికి రావద్దు...

## దళితుల అసైన్డ్ భూములు లాక్కోవడమే ప్రభుత్వ లక్ష్యమా....
## దళితులపైన ప్రభుత్వానికి దొంగ ప్రేమా...
## ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 20(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/దళితుల అసైన్డ్ భూములు లాక్కోవడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని దళితులను రోడ్డున పెడుతుంది అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ధ్వజమెత్తారు పటాన్ చెరువు మండలం,లగ్దారం గ్రామంలో ఆయన పర్యటించి అసైన్డ్ భూములు బాధితులతో మాట్లాడి అక్కడ భూములను పరిశీలించారు,అనంతరం వారు మాట్లాడుతూ 498 స్వరే నెంబర్ లో 22 ఎకరాలు భూమిని దళితులు 70 సంవత్సరాలుగా సాగు చేసుకుని జీవిస్తున్నారు,ఆరుతడి పంటలు వేసి పంటలు సాగు చేస్తున్నారు,భూమిలేని కుటుంబాలకు ఆనాడు కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రభుత్వం జీవనాధారం ఇచ్చిన భూమిని ఇప్పుడు ప్రభుత్వం ఎన్టిపి ప్లాంట్ వేయాలని అక్రమంగా లాక్కోవాలని చూడడం దళితులపైన ప్రభుత్వానికి ఉన్న దొంగ ప్రేమ మనకు కనిపిస్తున్నది,దళితుల అసైన్డ్ భూములె లక్ష్యంగా జిల్లాలో భూములు లాక్కోవడం పారిశ్రామికవేత్తలు కట్టబెట్టడం దళితులకు భూమి లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందా అనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు లగ్దారం దళితుల అసైన్డ్ భూముల జోలికి రావద్దని ఎమ్మార్పీఎస్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం ప్రభుత్వం భూములు లాక్కొని దళితులను ఇంకా పేదరికంలోకి నెట్టి వేయాలని చూస్తుంద అనే అనుమానం కలుగుతుంది,ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు దళితులకు న్యాయం చేయాలని వారిని మానసిక వేదనకు గురి చేయొద్దని పట్టా పాస్ బుక్ లు ఇచ్చి వారికి సహకరించాలని అన్నారు,ఈ కార్యక్రమంలో పొట్టోళ్ల వెంకటేష్ మాదిగ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు,బండ రాజు మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మల్లేష్,జీవన్ ,రైతులు మహిళలు పాల్గొన్నారు.




# రామ్‌దేవ్‌రావు హాస్పిటల్‌కు గర్వకారణమైన ఘనత..



**కూకట్పల్లి (ప్రజాబలం )జూన్ 20:**కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ప్రతిష్ఠాత్మకమైన హెల్త్‌కేర్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్ సందర్భంగా యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ కాలుష్య నియంత్రణ (బెస్ట్ పొల్యూషన్ కంట్రోల్ ) అవార్డును అందుకోవడం మాకు ఎంతో ఆనందంగా గర్వకారణంగా ఉంది. ఈ అవార్డును సీఈఓ డా.ఎన్.యోబు స్వీకరించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, బయోమెడికల్ వ్యర్థాల సమర్థ నిర్వహణ హరిత ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల అమలులో ఆసుపత్రి చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ సదస్సుకు తెలంగాణ గవర్నర్ మహామహులు శివ్ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి మరింత గౌరవాన్ని చేకూర్చారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్య నిపుణులు, ఆరోగ్య రంగ నాయకులు, విధాన నిర్ణేతలు, ఆసుపత్రి నిర్వాహకులు నాణ్యత నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్య రంగంలో నాయకత్వం, ఆవిష్కరణలు, స్థిరమైన అభివృద్ధి మరియు ఉత్తమ సేవలపై చర్చించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సహాయక సిబ్బంది అందరి సమిష్టి కృషికి నిదర్శనం. నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ పర్యావరణ పరిరక్షణలో ముందంజలో నిలవాలనే మా సంకల్పానికి ఇది గుర్తింపుగా నిలిచింది.ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి మాకు ప్రేరణగా నిలుస్తుంది. ఈ విశిష్ట విజయాన్ని సాధించిన రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు.

# కాపర్ వైర్ చోరీ నిందితుల అరెస్ట్



**జహీరాబాద్, జూన్ 20 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద గల ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లో చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై లవ కుమార్ తెలిపారు. ఈనెల 13న ట్రాన్స్ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ కు వెనుక నుండి రంధ్రం చేసి అందులో గల 120 కిలోల కాపర్ వైర్, 350 కిలోల అల్యూమినియం వైర్ దొంగిలించినట్లు వచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించమన్నారు. ఈనెల 19న రాత్రి జహీరాబాద్ ఆర్టీవో చెక్పోస్ట్ సమీపంలో దొంగతనానికి పాల్పడిన నిందితులను పట్టుకున్నామన్నారు. నిందితులు కర్ణాటకలోని బసవ కళ్యాణ్ కు చెందిన రంగుబాయ్ , సర్జాబాయి, అమీర్ సాబ్, తో పాటు ఇద్దరు మైనర్లు ఉన్నట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి చోరీకి పాల్పడిన సొత్తును రికవరీ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు.

# ఇంటింటి ఓటర్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి



**జహీరాబాద్, జూన్ 20 ప్రజాబలం ప్రతినిధి:** ఈనెల 25 నుండి జూలై 24 వరకు (ఎస్ ఐ ఆర్) ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసిల్దార్ దశరథ్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎల్ఓ లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని తహసిల్దార్ దశరథ్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ప్రారంభించారు. ఓటర్ల సర్వేలో తీసుకోవలసిన చర్యలు జాగ్రత్తలను మాస్టర్ ట్రైనర్లు తులసి రామ్ రాథోడ్ ,సంగమేశ్వర్ బి ఎల్ వో లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసిల్దార్ సుకుమారి, ఆర్ ఐ జాఫర్, బిఎల్వోలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



# మంత్రి సీతక్క గారి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన సర్పంచులు,గ్రామ పంచాయతీ సిబ్బంది



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి 20-06-2026** ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ములుగు జిల్లాలో శనివారం జరిగిన గ్రామ సర్పంచుల శిక్షణ అనంతరం ఏటూరునాగారం,కన్నాయిగూడెం, తాడ్వాయి,వాజేడు,వెంకటాపూర్ మండలానికి చెందిన గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,జీపివోలు,శానిటేషన్ సిబ్బంది స్వచ్ఛందంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ సీతక్క గారి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు పడే విధంగా మరియు గ్రామ సర్పంచులకు మంత్రి సీతక్క చొరవతో 5 నెలల జీతాలు ఒకే సారి పడేలా ఆదేశాలు జారీ చేసినందుకు వారి స్వచ్ఛందంగా మంత్రి సీతక్క గారికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారుఈ కార్యక్రమంలో, డిపివో, డి ఎల్ పి వో,ఏటూరునాగారం,కన్నాయిగూడెం, తాడ్వాయి,వాజేడు,వెంకటాపూర్ మండల సర్పంచులు,జీ పి వో లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మృతుడి కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 20(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల్ గ్రామానికి చెందిన కేసారం మొగులయ్య అనారోగ్యంతో బాధపడుతు శుక్రవారం రాత్రి 11:10 గంటలకు మృతి చెందడు.. అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు మొగులయ్య అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు పంపగా స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మనిలా లిసురేశ్ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు..ఈ కార్యక్రమం లో మాణిక్యం,బాలిరెడ్డి,సురేష్, బాలిరెడ్డి,చిరంజీవ్ రెడ్డి,హరికిషన్ రెడ్డి,రవి,రాచిరెడ్డి,రమేష్ ,జైపాల్,సుభన్ సుగుణాకర్, రామచేంద్రి,లక్ష్మణ్,బాగయ్య,జనార్ధన్,జగన్,సంగయ్య,కృష్ణ,భాస్కర్,బాబా గ్రామస్తులు తధితరులు పాల్గొన్నారు..

# నరహరి లాకర్ లో రూ 1.50 కోట్లు

హైదరాబాద్ లాండ్స్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నరహరి లాకర్స్ ను ఏసీబీ అధికారులు ఓపెన్ చేసారు. నరహరి బ్యాంకు లాకర్లో 1.50కోట్లు నగదు లభ్యం అయింది. శాలిబండ కెనరా బ్యాంకులో లాకర్లు డబ్బును ఏసీబీ అధికారులు గుర్తించారు. మరో రెండు లాకర్లు తెరుస్తామంటున్నారు. ఇప్పటికే నరహరి ఇంట్లో కోటి 54 లక్ష రూపాయలు నగదు స్వాధీన పరుచుకున్నారు. నరహరి బ్యాంక్ అకౌంట్లో 5 కోట్ల రూపాయల నగదు ఫ్రీజ్ చేసారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com